ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 30, అక్టోబరు 2024

కంభం ఎస్‌డీసీగా శివరామిరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు కంభం ఆర్‌అండ్‌ఆర్ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మాదాల వెంకటశివరామి రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శివరామిరెడ్డి ఇప్పటివరకు పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. అక్కడ పనిచేస్తున్న ఎస్‌డీసీని నాలుగు రోజుల క్రితం నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. కాగా కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.వరకుమార్‌ను తిరుపతికి బదిలీ చేశారు.

నేటి నుంచి ఉచిత సిలిండర్



- యథావిధిగా ఫోన్ నంబర్‌తో బుక్ చేసుకోవాలి
- గ్యాస్ అందిన 24 గంటల్లో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు డబ్బులు జమ
- ఏడాదికి మూడు మాత్రమే
- జిల్లావ్యాప్తంగా 6.82 లక్షల మందికి లబ్ధి
- సమస్యల పరిష్కారం కోసం 1967 టోల్‌ఫ్రీ నంబరు

8

దుర్భిక్ష ప్రాంతానికి ఆశాదీపమైన వెలిగొండ ప్రాజెక్ట్‌పై ప్రజల ఆశలు మరోసారి చిగురించాయి. నిర్మాణ తీరుతెన్నులపై నిశిత పరిశీలన చేస్తూ.. ఆర్భాట హామీలు లేకుండా లొసుగులను చూస్తూ.. ముగ్గురు మంత్రులు సాగించిన పర్యటన, చెప్పిన మాటలు అందుకు తోడ్పడ్డాయి. ఎన్నికల హామీలను అమలు చేస్తామంటూ ప్రాథమిక దశలో నీటి విడుదల సమయాన్ని ప్రకటించకుండా పనుల పునఃప్రారంభానికి ముహూర్తం నిర్ణయించడం మంత్రుల పర్యటనలో ముఖ్యాంశమైంది. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రాంతంలో మంగళవారం నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవి, డీఎస్‌బీవీ స్వామిలు యావత్తు అధికారులు, జిల్లాలోని టీడీపీ ప్రజా ప్రతినిధులతో కలిసి సాగించిన పర్యటన సఫలీకృతమైంది.



వెలిగొండ మొదటి సొరంగంలోకి వెళ్లి పరిశీలిస్తున్న మంత్రులు నిమ్మల, డోలా తదితరులు

చిగురించిన ఆశలు

- నిశిత పరిశీలనలు
- వచ్చే నెలలో వెలిగొండ పనులు పునఃప్రారంభం
- గుండ్లకమ్మను పూర్తిచేస్తాం
- చెరువుల మరమ్మతులకు నిధులిస్తాం
- గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూనే పరిష్కార మార్గాల అన్వేషణ
- పశ్చిమ ప్రాంతంలో ఎమ్మెల్యేలు, అధికారులతో ముగ్గురు మంత్రుల పర్యటన

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలోని పశ్చిమప్రాంత ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టిసారించింది. త్వరలో పనుల పునఃప్రారంభానికి సిద్ధమైంది. రమారమి 20ఏళ్ల నుంచి ప్రాజెక్ట్ నిర్మాణం అడుగు ముందుకు, మూడడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతూ ఎన్నికల సమయంలో పార్టీలకు వాగ్దానాల బాణీగా నిలిచిన విషయం విదితమే. 2019 ఎన్నికల్లో పార్టీలన్నీ ఆ ప్రాజెక్ట్‌పై హామీల వర్షం కురిపించాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వంలో ఆశించిన స్థాయిలో పనులు జరగలేదు. అనేక అడ్డంకుల మధ్య నీటి విడుదలకు అవకాశం లేకుండానే ఈ ఏడాది ఎన్నికలకు ముందు జగన్ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయగా, ప్రజలు మరోమారు దగా పడ్డారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఎన్నికల సమయంలో మళ్లీ టీడీపీ, వైసీపీలు హామీల వర్షం కురిపించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా పాలకులు వెలిగొండ అంశాన్ని ప్రస్తావించకపోవడంతో ప్రజల్లో మరోమారు అనుమానాలు మొదలయ్యాయి. ఈనేపథ్యంలో మంగళవారం జరిగిన పర్యటన ప్రజల్లో ఆశలను చిగురింపజేసింది.

ఆసాంతం నిశిత పరిశీలన

ప్రాజెక్టు నిర్మాణ అంశాలపై ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మంత్రులు నిశిత పరిశీలన చేశారు. ఉదయమే దోర్నాల వద్ద అతిథిగృహంలో మంత్రి రామానాయుడు సమీక్షించారు. అనంతరం టన్నెల్ ప్రాంతాన్ని పరిశీలించారు. మొదటి టన్నెల్ పనులు పూర్తయినా నీటి విడుదలకు ప్రారంభంలోనే

మిగతా 8వ పేజీలో

సుడిగాలి పర్యటన



వెలిగొండ ఫీడర్ కెనాల్‌కు పడిన గండిని పరిశీలిస్తున్న మంత్రులు నిమ్మల, గొట్టిపాటి, డోలా

- వెలిగొండ క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్న మంత్రులు
- అడుగడుగునా సమస్యల స్వాగతం
- నాణ్యతలో డొల్లతనం బహిర్గతం
- గోడు వెళ్లబోసుకున్న ముంపు గ్రామాల ప్రజలు
- ప్రాజెక్టుకు శాపంగా మారిన జగన్ పాలన
- టన్నెల్ సందర్శనలో మంత్రి నిమ్మల

8

నేడు కూటమి నేతల సమావేశం

హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం



ఒంగోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అధికార కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జిల్లాస్థాయి నేతల సంయుక్త సమావేశం బుధవారం ఒంగోలులో జరగనుంది. స్థానిక భాగ్యనగర్‌లోని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడం, మూడు పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా సర్దుబాటు, నామినేటెడ్ పదవులు ఇతరత్రా విషయాల్లో సమన్వయంతో

మిగతా 8వ పేజీలో



వధకు సిద్ధమైన నరకాసురుడి బొమ్మ (ఫైల్)

ఉల్లాస పరిచేలా నృత్యాలు

ఇక ఈ నరకాసురవధ కార్యక్రమంలో కృష్ణుడికి, నరకాసురుడికి మధ్య జరిగిన సంవాదానికి సంబంధించిన పలు పౌరాణిక పద్యాలను కళాకారులు రాగయుక్తంగా ఆలపిస్తారు. పది చేతులతో, పొడవైన ఎర్రని నాలుకతో, పదునైన కోరలతో నరకాసురుడి వేషధారి అచ్చం రాక్షసరాజులాగా చేసే సందడి ప్రజలను ఉల్లాసపరుస్తుంది. దాదాపు 3 నుంచి 4 లక్షల రూపాయల ఖర్చుతో నిర్వహించే ఈ నరకాసురవధ కార్యక్రమం ప్రస్తుతం తూర్పుపాలెం శ్రీ యువజన మిత్రమండలి ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా పలువురు యువకులు నిర్వహిస్తున్నారు. తమ పూర్వీకుల నుంచి ఈ ఆచారం వస్తోందని, దీనిని తాము కొనసాగిస్తున్నామని, పండుగల విశిష్టతను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఇటువంటి కార్యక్రమాలు మన పౌరాణిక ప్రశస్త్యాన్ని, సంస్కృతిని కాపాడటానికి ఎంతో ఉపయోగపడతాయని వారు చెబుతారు. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారీ నరకాసుర బొమ్మను తయారుచేసి స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో నరకాసుర దహనం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అక్కడ ఏర్పాటుచేసే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను హుషారెత్తిస్తాయి. ఈ విధంగా ఒంగోలు నగరప్రజలకు కేవలం దీపావళి పండుగ మాత్రమే కాకుండా, నరకచతుర్దశి సైతం ఎన్నో మధురానుభూతులను మిగులుస్తుంది.



నరకాసురుడి బొమ్మ దహనం (ఫైల్)

నేడు నరకచతుర్దశి, రేపు దీవాళి

నరకాసురవధ పౌరాణిక ఘట్టం ఏటా నిర్వహణ

సరదాల జావళి సంబరాల దీపావళి

దీపావళి పండుగ వచ్చిందంటేనే ఊరంతా సందడిగా మారుతుంది. టపాసుల మోతలు, చిచ్చుబుడ్ల వెలుగులతో చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ ఆనందకాంతులను పంచి ఇచ్చే ఏకైక పండుగ దీపావళి. ఈ పండుగను ఆశ్వయుజ అమావాస్య రోజు జరుపుకుంటారు. దీని వెనుక ఒక పౌరాణిక ప్రాశస్త్యం ఉంది. లోకకంఠకుడైన నరకాసురుడిని శ్రీకృష్ణుని సతీమణి సత్యభామ వధించటం వల్ల తమ కష్టాలు తొలిగిపోయాయన్న ఆనందంలో ప్రజలందరూ ఊరంతా దీపాలను వెలిగించి పండుగ జరుపుకుంటారు. అందుకే దీన్ని 'దీపావళి' అంటారు. ఆశ్వయుజమాసంలో అమావాస్యని దీపావళి పండుగ్గా జరుపుకుంటే ఆ ముందు రోజైన చతుర్దశి రోజున సత్యభామ నరకాసురుడిని వధించిందని పురాణాలు చెబుతున్నాయి. 1902లో అంటే 116 సంవత్సరాల కిందట నగరంలో ప్రారంభమైన ఈ 'నరకాసురవధ' రాష్ట్రంలో కేవలం ఒంగోలుకు మాత్రమే ప్రత్యేకం.

- రాష్ట్రంలో ఒంగోలుకే ప్రత్యేకంగా పండుగ
- వివిధ వేషధారణలు, డప్పువాద్యాలతో కోలాహలం
- టపాసులతో సందడి చేయనున్న పిల్లలు, పెద్దలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తూర్పుపాలెంలో ఈ నరకాసురవధ కార్యక్రమం 1902లో ప్రారంభమైంది. అప్పట్లో తూర్పుపాలెం నివాసి సింగరాజు సుబ్బయ్య ఈ నరకాసురవధ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పెద్దలు చెబుతారు. ఆ ఆచారం తరాలు మారినా నేటికీ కొనసాగుతూనే ఉంది. సహజంగా గడ్డితో నరకాసురుడి బొమ్మను తయారుచేసి నరక చతుర్దశి రోజు తెల్లవారుజామునే పిల్లలు తమ ఇంటిముందు ఆ బొమ్మను తగులబెట్టటం అనాదిగా వస్తున్న ఆచారం. అనేకచోట్ల ఈ గడ్డిబొమ్మను తయారుచేసేటప్పుడు అందులో ఉప్పును వేస్తారు. దీంతో బొమ్మ తగులబడే సమయంలో చిటపట శబ్దాలు చేస్తూ సందడి చేస్తుంది. అయితే ప్రస్తుతం చాలామంది ఆ బొమ్మలో చిన్నచిన్న టపాసులను ఉంచుతున్నారు. నరకాసురుని బొమ్మ తగులబడే సమయంలో అవి పేలి శబ్దాలు చేస్తుంటే చిన్నా పెద్దా అందరూ కేరింతల్లో మునిగితేలుతుంటారు. అయితే నరకాసుర వధను ప్రజలకు కళ్లముందు సాక్షాత్కరింపజేయాలనే ఉద్దేశంతో 116 సంవత్సరాల కిందట ఒంగోలులో ఈ నరకాసురవధ ఘట్టం ప్రారంభించినట్లు చెబుతారు.

తూర్పుపాలెం నుంచి

నరకచతుర్దశి రోజు రాత్రి 12 గంటల సమయంలో ఈ నరకాసురవధ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వేలాదిగా ప్రజలు పాల్గొనే ఈ కార్యక్రమం దాదాపు 5 గంటలపాటు కొనసాగుతుంది. ఇందులో కొంతమంది శ్రీకృష్ణుడు, సత్యభామ, నరకాసురుడు వేషధారణల్లో పాల్గొంటారు. తూర్పుపాలెం రాజరాజేశ్వరస్వామి దేవస్థానం కూడలి వద్ద నుంచి ముందుగా కృష్ణుడు, సత్యభామ వేషధారులు ఎక్కిన వాహనం ర్యాలీగా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసే డప్పువాయిద్యాలు, మేళతాళాలతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంటుంది. ఆ వాయిద్యాలకు తగిన విధంగా ఎంతో ఉత్సాహంతో ప్రజలు నృత్యాలు చేస్తూ సందడి చేస్తారు. తూర్పుపాలెం వద్ద నుంచి శ్రీకృష్ణుడు, సత్యభామల రథం ప్రారంభమైన కొంతసేపటికి నరకాసురుడి వాహనం బయల్దేరుతుంది. అక్కడి నుంచి ఈ వాహనాలు నగరంలోని బీవీఎస్ హాల్, ట్రంకురోడ్డు, అంబేద్కర్ విగ్రహం, రాజాపానగల్ రోడ్డు, లాయర్‌పేట, కొత్తపేట మొదలైన ప్రధాన రహదారుల నుంచి కొనసాగి దీపావళి రోజు తెల్లవారుజామున పప్పుబజారులోని గాంధీవిగ్రహం వద్దకు తొలుత కృష్ణుడి వాహనం, ఆ తర్వాత నరకాసురుడి వాహనం చేరుకుంటాయి.

చిగురించిన ఆశ

(7వ పేజీ తరువాయి)

భారీగా మట్టి, ఇతర వ్యర్థపదార్థాలు అడ్డంకులుగా ఉండడాన్ని గుర్తించారు. రెండో టన్నెల్‌లో 7 కి.మీ లైనింగ్ నిర్మాణం కూడా జరగకపోవడాన్ని పసిగట్టారు. రెండో టన్నెల్ పూర్తికావడానికి మొదటి టన్నెల్ వద్ద ఉన్న మట్టిని తీసివేయడానికి మరో ఏడు నెలలకుపైగా సమయం పడుతుందని గుర్తించారు. ఆ తర్వాత మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు బైక్‌లపై కాలువలపై ప్రయాణించి వాస్తవ పరిస్థితిని పరిశీలించారు. ప్రాజెక్ట్ ప్రధాన కాలువే ధ్వంసమైనట్లు కనిపించగా, పిల్ల కాలువల పనులు పూర్తిగాని విషయం తేటతెల్లమైంది. అక్కడి నుంచి గొట్టిపడియ రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ రూ.73 కోట్లతో నిర్మించిన మంచినీటి సరఫరా పథకం ఇంకా అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, యెర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు పైపులైన్లు నిర్మించాలి. ఆ తర్వాత మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ముగ్గురు మంత్రులు మొత్తం ప్రాజెక్టు రూపురేఖలను సమీక్షించారు. తద్వారా గతంలో ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయడం అధికారికంగా వెల్లడి కావడమేగాక, గత నాలుగు నెలలుగా ప్రాజెక్ట్ పనులు పూర్తిగా ఆగిపోయినట్లు తెలుసుకున్నారు.

నవంబరులో పనులు పునఃప్రారంభం

మొత్తం పరిస్థితిని తెలుసుకున్నాక మంత్రి రామానాయుడు నవంబరులో ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పునఃప్రారంభిస్తామని స్పష్టం చేశారు. మంత్రులు రవి, స్వామి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సాగు,తాగునీరు అందిస్తుందని చెప్పారు.సీఎం చంద్రబాబు సూచన మేరకు తాము పరిశీలించామని, పూర్తి నివేదికను సీఎంకు ఇస్తామని మంత్రి రామానాయుడు చెప్పారు. ఇప్పటికైతే నవంబరులో పనులు ప్రారంభిస్తామని చెప్పగలనంటూ నీటి విడుదల సమయాన్ని సీఎం ఉన్నత స్థాయిలో సమీక్ష అనంతరమే వెల్లడిస్తామని చెప్పారు.

గుండ్లకమ్మ, సాగునీటి చెరువులపైనా దృష్టి

ప్రకాశం జిల్లా అభివృద్ధిపట్ల సీఎం శ్రద్ధతో ఉన్నారని మంత్రి నిమ్మల తెలిపారు. గుండ్లకమ్మ గేట్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో సాగునీటి చెరువుల నిర్వహణకు నిధులను విడుదల చేస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో మరికొన్ని రిజర్వాయర్లు, సాగర్ కాలువల బాగు చేపడతామని తెలిపారు. ఈ పర్యటనలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, ఇన్‌చార్జులు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, లంకా దినకర్‌తోపాటు టీడీపీ నేతలు, కలెక్టర్ అన్సారియాతోపాటు ముఖ్య అధికారలు పాల్గొన్నారు.

నేడు కూటమి నేతల సమావేశం

(7వ పేజీ తరువాయి)

పనిచేసేలా జిల్లా స్థాయిలో ఇలాంటి సమావేశాల నిర్వహణకు రాష్ట్ర పార్టీలు నిర్ణయించాయి. తదనుగుణంగా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో వాటిని నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా బుధవారం ఒంగోలులో నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు ఈ స మావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో టీడీపీ నుంచి మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలు అలాగే కూటమి పార్టీలైన జనసేన, బీజేపీల నుంచి ఆ పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొంటారని సమాచారం. కాగా ఇన్‌చార్జి మంత్రి ఆనం బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక రామనగర్‌లోని ఎంపీ మాగుంట కార్యాలయానికి చేరుకొని అనంతరం టీడీపీ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరుకానున్నారు.

సుడిగాలి పర్యటన



ప్రాజెక్టు పూర్తి నమూనా ద్వారా పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రులు రామానాయుడు, రవికుమార్, స్వామి

- ప్రతి పనీ నిశితంగా పరిశీలన..
- వెలిగొండ క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్న మంత్రులు
- అడుగడుగునా సమస్యల స్వాగతం
- దర్శనమిచ్చిన నాణ్యత లేని పనులు
- గోడు వెల్లబోసుకున్న ముంపు ప్రజలు

మార్కాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలోని కరువు ప్రాంతాల ఆశాదీపం పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులను మంగళవారం మంత్రులు సుడిగాలి పర్యటనతో పరిశీలించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశం మేరకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం తెల్లవారుజామునే దోర్నాలకు వచ్చారు. ఉదయం 8.00 గంటలకల్లా ఉమ్మడి జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, అధికారులు దోర్నాలలోని వెలిగొండ ప్రాజెక్టు గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ అల్పాహారం అనంతరం ఇరిగేషన్ సీఈ శ్యామ్‌ప్రసాద్, ప్రాజెక్టు ఎస్ఈ అబూతలీమ్‌లతో భేటీ అయ్యారు. ఇప్పటివరకు పనులు కొనసాగిన తీరు, పెండింగ్ పనులపై చర్చించారు. ముందుగా టన్నెల్-2కు వెళ్లారు. అక్కడ ప్రత్యేక వాహనాల్లో టన్నెల్ లోపలికి 3 కిలోమీటర్ల మేర వెళ్లారు. అక్కడ అధికారులు రెండు టన్నెల్ పనుల సాంకేతిక అంశాలను వివరించారు.

మండుటెండలో.. ద్విచక్ర వాహనాలపై..

ప్రాజెక్టు పనుల్లో అత్యంత కీలకమైన ఫీడర్ కెనాల్‌ను పరిశీలించడానికి కడపరాజుపల్లి గ్రామానికి నేతలు చేరుకున్నారు. గత నెలలో కురిసిన వర్షానికి ఫీడర్ కెనాల్‌కు పలుచోట్ల గండ్లు పడ్డాయి. దీంతో పరిశీలనకు కార్లలో వెళ్లేందుకు వీలులేకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ మండుటెండలో బైకులపై సుమారు నాలుగు కిలోమీటర్ల మేర తిరిగి పరిశీలించారు. చాలాచోట్ల ఒకవైపు కట్టకు గండ్లు పడి ఉండటాన్ని గమనించారు. పెద్దపాటి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడి నుంచి గొట్టిపడియ డ్యామ్ వద్దకు వెళ్లారు.

ఇంటెక్ వెల్ పనుల పరిశీలన

ఏడు నియోజకవర్గాలు, 1,697 గ్రామాలకు తాగునీటిని అందించే వాటర్‌గ్రిడ్‌లో అత్యంత కీలకమైన ఇన్‌టెక్ వెల్ పనులను మంత్రులు, ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. అక్కడ రూ.75 కోట్లతో జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా పనులు పూర్తవుతాయని వారు తెలియజేశారు. ప్రాజెక్టు లోపల ఏయే గ్రామాలు ముంపునకు గురయ్యేది, నీరు ప్రాజెక్టులో ఉంటే భూగర్భజలమట్టాలు ఏ విధంగా పెరుగుతాయో వివరించారు. అక్కడి నుంచి మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు.

ప్రాజెక్టు పూర్తి నమూనాతో డెమో

స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి నమూనాను ప్రాజెక్టు ఎస్ఈ అబూతలీం డెమో ద్వారా మంత్రులు, శాసనసభ్యులకు వివరించారు. ఏ పనులు ఏ స్థాయిలో ఉన్నాయి, వాటి పురోగతి, ఇంకా చేపట్టాల్సిన వాటి వివరాలన్నింటిని వారికి తెలియజేశారు.

అడుగడుగునా గోడు వెల్లబోసుకున్న నిర్వాసితులు

ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన తమకు ఇంకా పరిహారం, పునరావాసం పూర్తి చేయలేదని ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన మంత్రులను కలిసి నిర్వాసితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. టన్నెల్ వద్ద సుంకేసుల గ్రామానికి చెందిన వాళ్లు కొందరు తమకు పరిహారం ఎప్పుడు అందజేస్తారో చెప్పాలని కోరారు. ప్రస్తుతానికి తాము ప్రాజెక్టును సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి తెలియజేయడానికి వచ్చినట్లు వారిని మంత్రులు సముదాయించారు. అక్కడి నుంచి ఫీడర్ కెనాల్ వద్ద వెళ్లగా గుండంచర్ల గ్రామస్థులు కలిసి పునరాసవాస కాలనీ సమస్యను తెలియజేశారు. స్థల ఎంపిక జరిగినా మౌలిక వసతుల కల్పన ఇంకా ప్రారంభం కాలేదని వివరించారు. త్వరలోనే పెండింగ్ పనులు పూర్తిచేస్తామని మంత్రి రామానాయుడు వారికి హామీ ఇచ్చారు. అక్కడి నుంచి గొట్టిపడియ డ్యామ్ వద్దకు వెళ్తున్న క్రమంలో కోమటికుంట వద్ద గొట్టిపడియ, అక్కచెరువు గ్రామాల నిర్వాసితులు వాహనశ్రేణికి అడ్డుగా నిలబడి ఆపారు. కిందకి దిగి వారితో మంత్రి మాట్లాడారు. సమీపంలోని ఆ రెండు గ్రామాల పునరావాస కాలనీల దుస్థితిని మంత్రికి వారు వివరించారు. అంతేకాక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు అందజేయడానికి వచ్చిన సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులతోనూ మంత్రులు సావధానంగా మాట్లాడారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పట్ల కొనసాగిన నిర్లక్ష్యాన్ని వారికి వివరించారు. ఎన్నికల్లో వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని తప్పకుండా త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని వారికి తెలియజేశారు.

'వెలిగొండ'కు శాపంగా జగన్ పాలన

- టన్నెల్ సందర్శనలో మంత్రి నిమ్మల
- త్వరలో పనులు పునఃప్రారంభించనున్నట్లు వెల్లడి

పెద్ద దోర్నాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంత ప్రజల ప్రజల జీవనాడి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి గత జగన్ పాలన శాపంగా మారిందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని కీలక భాగం రెండో సొరంగం పనులను ఆయన మంత్రులు అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో వెళ్లి సొరంగం లోపలిభాగం పనులను బృందం పరిశీలించింది. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి గత టీడీపీ హయాంలో రూ.1373 కోట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టి రూ. 1319 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.3518 కోట్లు కేటాయించామని గొప్పలు చెప్పుకొని కేవలం రూ.170కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని గుర్తుచేశారు. నిర్వాసితులకు పరిహారం రూ.888 కోట్లు ఇవ్వాలిసి ఉండగా రూపాయి కూడా చెల్లించలేదన్నారు. టన్నెళ్లలో తవ్విన మట్టిన బయటకు తరలించకుండా సొరంగాల్లోనే పోశారన్నారు. దీంతో బోరింగ్ మిషను లోపలి నుండి బయటకు తీసుకురాకుండా నీళ్ల ఇవ్వడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఒక్కరికి పునరావాసం కల్పించకుండా భూములిచ్చిన రైతులను మోసం చేసినట్లు కాదా అన్నారు. ఫీడర్ కెనాల్ అధ్వాన స్థితిలో ఉందన్నారు. ఆ కాలువ నుంచి నీళ్ల వదిలితే, నల్లమల సాగర్‌కు చేరే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రాజెక్టు పురోగతిపై పరిశీలించేందుకు వచ్చామన్నారు. పూర్తి వివరాలతో నివేదికలు అందజేసి వీలైనంత త్వరగా పనులు పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. రెండు దశల్లో పూర్తిచేసి ప్రజలకు తాగునీరు, లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేయనున్నట్లు చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పోలవరం తర్వాత అత్యంత ప్రాధాన్యత వెలిగొండకు ఇస్తున్నారన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించి టీడీపీ హయాంలోనే ప్రాజెక్టు నుంచి నీటిని రైతులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బి.ఎన్.విజయకుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కందుల నారాయణరెడ్డి, ఇన్‌చార్జులు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్‌ల బృందం మంగళవారం సందర్శించింది. ఈక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు నిర్మాణం పనుల వివరాలు తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

నేటి నుంచి ఉచిత సిలిండర్

- యథావిధిగా ఫోన్ నెంబర్‌తో గ్యాస్ బుకింగ్
- డెలివరీ అయిన 24 గంటల్లో లబ్ధిదారుని ఖాతాకు నగదు జమ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత సిలిండర్ పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. అందుకు అవసరమైన విధివిధానాలను ఇప్పటికే ప్రకటించారు. ఈనెల 31న దీపావళి పండుగ కావడంతో ఆ రోజు నుంచి అమలుచేసేందుకు ముందురోజు నుంచే సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల్లో బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగాయి. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు గత సార్వత్రిక ఎన్నికల్లో ఉచిత గ్యాస్ పంపిణీకి హామీ ఇచ్చారు. ఆమేరకు ఆ పథకాన్ని దీపావళి పండుగ నుంచి అమలుచేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత సిలిండర్ పథకంతో జిల్లావ్యాప్తంగా 6,82,437 మందికి లబ్ధి చేకూరనుంది. కాగా ఉచితం పొందేందుకు అర్హతలను కూడా ఇప్పటికే ప్రకటించారు. గ్యాస్ కనెక్షన్ యాక్టివ్‌లో ఉండటంతోపాటు ఆధార్, రైస్‌కార్డు గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానంతోపాటు ఇతర శాఖల డేటాబేస్‌తో అనుసంధానమై ఉంటే ఈ పథకం వర్తిస్తుంది. ఏడాదికి మూడు సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. అయితే ప్రస్తుతం ఐదు నెలల సమయం ఉన్నందున ఉచిత సిలిండర్‌ను ఎప్పుడైనా బుక్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత యథావిధిగా సిలిండరు ఇంటికి వచ్చిన తర్వాత లబ్ధిదారుడు ఏజెన్సీకి గ్యాస్ ధర ఎంత ఉంటుందో అంత చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా చెల్లించిన 24 గంటల్లో లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం ఆ నగదును జమచేస్తుంది. మరోవైపు లబ్ధిదారులు ఉచిత గ్యాస్ విషయంలో ఏమైనా సమస్యలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసేందుకు 1967 టోల్‌ఫ్రీ నెంబరు కూడా ఏర్పాటు చేసింది.

సైన్స్ ఫెయిర్‌లతో సృజనాత్మకత

కొత్త ఆవిష్కరణలతో విద్యార్థుల మేధస్సుకు పదును

మంత్రి డాక్టర్ స్వామి

ముగిసిన జోనల్-3 గురుకులాల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

విజేతలకు మెడల్స్ అందజేత



విద్యార్థి ఎ.సంధ్య, గైడ్‌టీచర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి స్వామి



డి.ప్రత్యూష, ప్రాజెక్ట్ గైడ్‌టీచర్‌ను అభినందిస్తున్న మంత్రి స్వామి

కొండపి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సైన్స్ ఫెయిర్‌లతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. దీని వలన మానవాళికి మేలు చేసే కొత్తకొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. జోన్-3 గురుకులాల జోనల్ (ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, పాక్షిక నెల్లూరు) స్థాయి సైన్స్‌ఫెయిర్ కొండపిలోని గురుకులంలో సోమ, మంగళవారాల్లో జరిగింది. ముగింపు సభలో మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. రాజోలే రోజుల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా గురుకులాలు, సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను తీర్చిదిద్దుతామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రస్తుత ఏడాది నుంచి సింగరాయకొండలో బాలికల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రానున్న రోజుల్లో అదనంగా అనేక హాస్టళ్లు, కొత్త పాఠశాలలు, కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు మరికొంత పారితోషికం ఇచ్చి గురుకులాల్లో అదనపు తరగతులు, ప్రత్యేక క్లాసులు నిర్వహించే ఆలోచన చేస్తున్నామని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ సంజీవరావు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల గురుకులాల కో ఆర్డినేటర్లు డి.జయ, పి.పద్మజ, జయలక్ష్మి, కొండపి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి పాల్గొన్నారు.

జోనల్ స్థాయిలో 61 ప్రాజెక్టుల ప్రదర్శన

ప్రకాశం, గుంటూరు ఉమ్మడి జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లాలోని పాక్షికంగాలలో ఉన్న గురుకులాల (జోన్-3) సైన్స్‌ఫెయిర్ (ఫ్యూచర్ ఆన్) మంగళవారం రాత్రి ముగిసింది. ఆయా జిల్లాలస్థాయిలో గతంలో పోటీలు నిర్వహించి జిల్లాకు 20 చొప్పున మొత్తం 60 ప్రాజెక్టులు జోన్-3 స్థాయికి ఎంపిక చేశారు. వీటితోడు జనరేషన్ కింద ప్రకాశం జిల్లా నుంచి ఒకటి ఉంది. సైన్స్ సోషల్, మ్యాథ్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగాల్లో విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలు పరిశీలించి సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇచ్చారు. విద్యార్థులకు పతకాలు, గైడ్ ఉపాధ్యాయులకు, స్కూల్ ప్రిన్సిపాళ్లకు ప్రశంసాపత్రాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

విజేతలు వీరే..

సైన్స్‌లో.. సీనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా నరసాయపాలెనికు చెందిన డి.ప్రత్యూష (స్మార్ట్ అండ్ సేఫ్ అగ్రికల్చర్) ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా తాడికొండకు చెందిన కె.కార్తీక ప్రాజెక్టు (సేఫ్టీ మెన్‌హోల్ ఆటోమేటిక్ డివైజ్) రెండో స్థానానికి ఎంపికైంది. జూనియర్ విభాగంలో నెల్లూరు జిల్లా బోగోలుకు చెందిన డి.వర్షిత (మల్టీ పర్పస్ అగ్రికల్చర్ టూల్స్ అండ్ ఆటోమేటిక్ రైన్ రూఫ్) ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా నాగులపాలెంకు చెందిన డి.భవిష్య (పాపులేషన్ ఫ్రీ ఇండియా)ప్రదర్శనకు ద్వితీయ బహుమతి లభించింది.

మ్యాథ్స్‌లో.. సీనియర్స్ విభాగంలో నెల్లూరు జిల్లా కోడూరుకు చెందిన ఎ.డీస్పీసంధ్య ప్రాజెక్టు (అప్లికేషన్ ఆఫ్ ట్రిగనామెట్రీ) ప్రథమస్థానం సాధించింది. అదేజిల్లా బుచ్చిరెడ్డిపాలెంనకు చెందిన వై.పవిత్ర ప్రదర్శన (సర్కిల్ థీయమ్స్, ఎక్స్‌ప్లైనింగ్ పై వాల్యూ) ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. జూనియర్స్ విభాగంలో నెల్లూరు జిల్లా కదిరికు చెందిన జి.వైష్ణవశ్రీ ప్రాజెక్టు (ప్రాపర్టీస్ ఆఫ్ డిస్క్స్) ప్రథమ, బాపట్ల జిల్లా నాగులపాలెంనకు చెందిన పి.సుదీక్షిత ప్రదర్శన (యాంగిల్ మేడ్ బై ఎ ట్రాన్స్‌వర్సల్) ద్వితీయ స్థానంలో నిలిచాయి.

సోషల్‌లో.. గుంటూరు జిల్లా అమరావతికి చెందిన కె.విజయలక్ష్మి ప్రదర్శన (రైన్ వాటర్ హార్వెస్టింగ్) ప్రథమ, బాపట్ల జిల్లా నరసాయపాలెంనకు చెందిన టి.కల్యాణి ప్రాజెక్టు (సస్టెనబుల్ స్మార్ట్‌సిటీ) ద్వితీయ స్థానంలో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన ఎం.హర్షిత ప్రదర్శన (ఎర్త్‌క్వేక్ అలారం) ప్రథమ, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన వి.చాన్సల్ ప్రదర్శన (స్వచ్ఛ మిషన్) ద్వితీయ బహుమతి సాధించాయి.

ఐసీటీలో.. సీనియర్స్ విభాగంలో నెల్లూరు జిల్లా నరసింగ కొండకు చెందిన విద్యార్థుల ప్రాజెక్టు (మేకర్ అండ్ సోలార్ పెన్సిలింగ్ సెక్యూరిటీ సిస్టం) ప్రథమ, ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన జె.అక్షయ ప్రాజెక్టు (జేబీటీ బిల్డింగ్ ఎ మొబైల్ యాప్, హెల్పో యాప్) ద్వితీయ బహుమతి సాధించాయి. జూనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా నాగులపాలెం విద్యార్థి కె.కావ్య ప్రదర్శన (స్మార్ట్ బ్లైండ్ స్టిక్) ప్రథమ, నెల్లూరు జిల్లా ముత్తుకూరుకు చెందిన వి.స్వాతి ప్రదర్శన (డ్రోన్) ద్వితీయ స్థానంలో నిలిచాయి.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో.. సీనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా కంభం విద్యార్థిని కె.మాధురి ప్రదర్శన (పేపర్ డిజైన్స్) ప్రథమ, ఐడీజిల్లా వలేటివారిపాలెంకు చెందిన వై.ఆదిత్య ప్రదర్శన(ఆర్ట్ అండ్ పెయింట్స్) ద్వితీయ స్థానంలో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా ఆర్డవీడుకు చెందిన జి.జాహ్నవి ప్రాజెక్టు (ఆడిక్షన్ ఆఫ్ సెల్‌ఫోన్స్)కు ప్రథమ, నెల్లూరు జిల్లా ఆదురుపల్లికి చెందిన సిహెచ్.నిత్య ప్రదర్శన (వస్ట్ ఆఫ్ అండ్ క్రాఫ్ట్)కు ద్వితీయ బహుమతులు లభించాయి.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎస్పీ దామోదర్



రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు, పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో రక్తదానం చేసిన ప్రాణదాతలుగా నిలవాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఒంగోలులోని పోలీసు కల్యాణమండపంలో రిమ్స్ రెడ్‌క్రాస్, కిమ్స్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది, అధికారులు సుమారు 500మందిపైగా రక్తదానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమాజ రక్షణ కోసం బలిదానం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలకు స్ఫూర్తిగా జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్లలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి సరైన సమయంలో రక్తం అందించాలనే కృతనిశ్చయంతో రక్తదాన శిబిరాలు నిర్వహించామని, సామాజిక బాధ్యతతో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, డాక్టర్లు భానుమతి, సుబ్బారావు, లియాఖతాలీ, సింధూర, సేవలు రామవేంద్రరావు, పాండురంగారావు, అజయ్‌కుమార్, నాగరాజు, శ్రీకాంత్‌బాబు, హజరత్తయ్య పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతులు

● మరుగుదొడ్లు, మంచినీటి వసతికి నిధులు

మద్దిపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు వసతుల లేమిపై ఐసీడీఎస్, గ్రామీణ నీటిసరఫరాశాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. తొలిదశలో మండలంలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్డి నిర్మాణాలకు ఒక్కొక్క దానికి రూ.36వేలు, మంచినీటి వసతి కోసం రూ.17వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. నవంబర్ 14కు పనులు పూర్తి చేస్తామని ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు. పనులకు సంబంధించిన నిధులను మహిళా శిశు సంక్షేమ శాఖ జమ జరిగిందని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు మహ్మద్ ఆయాజ్ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు నిరుపేద కుటుంబానికి ఆర్థికసహాయం అందజేశారు. మంగళవారం స్థానిక చంద్రయ్య నగర్‌లోని ఆయాజ్ నివాసం వద్ద ఆయన కుమారులు మహ్మద్ అఫ్జల్, మహ్మద్ ఫర్హద్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ చావల వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి రూ.5వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు నయీమ్ ఖాదర్‌వలీ, వహాబ్ కరిముల్లాఖాన్, షేక్ ఉస్మాన్‌షరీఫ్, ఇర్ఫాన్, సుభానీ, రఫీ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాకారులు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు విశేష స్పందన లభించింది. మంగళవారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో అథ్లెటిక్స్ విభాగంలో రాజశేఖర్, బాలరాజు, కోటేశ్వరరావు, సురేంద్రకుమార్, మాధవరావు, జగదీశ్వరి, మాధవలత, శిరీష, అరుణ, ఉషారాణి, అలాగే బ్యాడ్మింటన్‌లో సైమన్, విజయ్‌భాస్కర్, నారాయణమహేంద్ర, వెంకటేశ్వర్లు, చెస్ పోటీలలో ప్రసాద్, అశోక్, క్రికెట్ పోటీలలో సైమన్, కళ్యాణ్, రాజశేఖర్, వెంకటనాగేశ్వరరావు, సత్యనారాయణ, క్యారమ్స్ పోటీలలో మస్తాన్ వలి, విజయ భాస్కర్‌లు విజయం సాధించారు.

బైకును ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

నాగులుప్పలపాడు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బైకును కారు ఢీకొనడంతో ముగ్గురు యువకులు గాయాలపాలైన సంఘటన నాగులుప్పలపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన నల్లా పవన్, యడ్లపల్లి గంగాధర్, మరొక యువకుడు మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై 216 జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నారు. నాగులుప్పలపాడులోని విన్నేల సెంటర్ నుంచి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో చీరాల వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఏఎస్ఐ సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు.

పోలీసు సిబ్బందికి సత్కారం

కొత్తపట్నం(ఒంగోలు నగరం) అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కొత్తపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కొత్తపట్నం శాఖ ట్రూప్, అంబేడ్కర్ ట్రూప్ ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొక్కులగడ్డ పాండురంగారావు, కానిస్టేబుల్ తురిమెళ్ల సుకన్య, మెరైన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పులుగు రామిరెడ్డి, తీరప్రాంత గస్తీ దళం హోంగార్డులు కోమరి లక్ష్మణ్, దండుప్రోలు వెంకటప్పన్న, కొత్తపట్నం సచివాలయం మహిళా పోలీసు పిచికల చెంచులక్ష్మిలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సాయి కిషోర్, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ కొడిజేటి వెంకటేశ్వరావు, జిల్లా ట్రెజరర్ పర్రె వెంకయ్య, గైడ్ కెప్టెన్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి అపహరణ.. ఒక్కరోజులోనే ఛేదన

కావలి డీఎస్పీ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత

నిందితురాలిని పట్టుకున్న పొన్నలూరు ఎస్సైకి పలువురి ప్రశంసలు

కావలి/పొన్నలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లో ఊయలలోని బాలుడిని అపహరించిన సంఘటన జిల్లాలో సంచలనమైంది. ఈ కేసును పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఒక్కరోజులోనే ఛేదించారు. బాలుడి ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రులకు రాజేశ్వరి, సురేష్‌లకు మంగళవారం రాత్రి కావలి డీఎస్పీ సమక్షంలో పోలీసులు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కావలి పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన పల్లపు రాజేశ్వరి తన ఒక సంవత్సరం వయస్సున్న కుమారుడు తేజను ఇంటి ముందు ఊయలలో నిద్రపుచ్చి ఇంటి పనుల్లో నిమగ్నమైంది. కావలి పట్టణంలోని మరో ప్రాంతానికి చెందిన స్వరూప అనే మహిళ పథకం ప్రకారం బాలుడిని కిడ్నాప్ చేసి కారులో తీసుకువెళ్లింది. సమాచారం అందుకున్న కావలి సబ్‌డివిజన్ పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినా మంగళవారం ఉదయానికి కూడా ఆచూకీ తెలియలేదు. దీంతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ కావలికి వచ్చి దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీ ఫుటేజ్, దర్యాప్తులో దొరికిన ఆధారాల మేరకు అపహరణకు పాల్పడిన మహిళతో ఆ బాలుడుంతో ఉన్న పరిచయం, కావలిలో ఆమె ఎక్కడ పనిచేస్తుందో తెలుసుకుని వారి బంధువులు, ఆమె పనిచేస్తున్న యజమానుల వద్ద ఆమె ఫోన్ నంబరు సేకరించారు. దాని ఆధారంగా ఆమె నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలో ఉన్నట్లు గుర్తించి అక్కడ పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు. ఇటు ప్రకాశం పోలీసులను కూడా అప్రమత్తం చేశారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో పొన్నలూరు, కనిగిరి రోడ్డులో పొన్నలూరు ఎస్సై అనూక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. దీంతో కిడ్నాప్ చేసిన మహిళ బాలుడితోసహా పోలీసులకు దొరికిపోయింది. వారిని కావలి పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా అనూక్‌ను పలువురు ప్రశంసించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

టంగుటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టంగుటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో దేవసేనకుమారి, ఎంఈవోలు చెంచుపున్నయ్య, బాలాజీ, వర్గం హనుమంతరావు, న్యాయసేవా సహాయకులు వెంకటేశ్వర్లు ఉన్నారు. తెలుగు పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మద్యం విక్రయాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● ఎస్పీ దామోదర్





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, పాల్గొన్న పోలీసు అధికారులు

ఒంగోలు క్రైం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మద్యం విక్రయాలలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఎక్సైజ్, పోలీసు అధికారులతో కలిసి మద్యంవిక్రయాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో ఎంఆర్పీ ధరకు అధికంగా విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసినా చర్యలు తప్పవన్నారు. మద్యం షాపులు, బార్‌లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేయకూడదని తెలిపారు. అలాగే మద్యం దుకాణాల వద్ద మద్యం ధరల బోర్డు ఏర్పాటు తప్పక చేర్పాటు చేయాలని సూచించారు. నాటుసారా, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం రవాణాను అరికట్టాలని ఆదేశించారు. ఎక్సైజ్, పోలీసులు సమన్వయంతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా సత్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ కె.నాగేశ్వరావు, ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ విజయ, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి మొహిద్దీన్, సీఐ ఎస్ఐలు ఐవెంకటేష్, దాసరి బాలయ్య, జనార్దనరావు, ఎస్సీ సీఐ‌లు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు తహసీల్దార్ల అభినందనలు



డీఆర్వో ఓబులేశుకు బొకేను అందజేస్తున్న తహసీల్దార్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన చిన్నఓబులేశును తహసీల్దార్లు అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో మంగళవారం తహసీల్దార్ల సంఘం రాష్ట్ర నేత, కొత్తపట్నం తహసీల్దార్ ఎస్‌కే మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్లు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ వర్గాయి పోటీ చేస్తున్నట్లు మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో వాసుదేవరావు, సాయి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో..

డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన చిన్న ఓబులేశును గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు స్థానిక కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏపీఆర్.అదిరెడ్డి ఆధ్వర్యంలో డీఆర్వోకు బొకే అందజేశారు. జిల్లాలో జీవీఎం 450మంది వీఆర్వోలు బదిలీ అయ్యారని, వారిలో చాలా మంది ఇంకా రిలీవ్ చేయలేదని తెలిపారు. సంఘ కార్యాలయానికి స్థలం కేటాయించాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు సకాలంలో సర్వే శిక్షణ ఇప్పించి ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని, రెగ్యులర్ చేసి టైం స్కేలును వర్తింపజేయాలని డీఆర్వోను కోరారు. జిల్లా నాయకులు కనిగిరి డివిజన్ నాయకులు చంద్రశేఖర్, రమేష్‌బాబు, వెంకటరామయ్య పాల్గొన్నారు.

కోళ్ల పెంపకం మాటున పందేలు

నిర్వాహకుడితోపాటు 24మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

30కోళ్లు, రూ.76వేల నగదు స్వాధీనం

ఒంగోలు క్రైం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): కోళ్ల పెంపకం మాటున కోడి పందేలు నిర్వహిస్తున్న నిర్వాహకుడితోపాటు, జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మంగళవారం ఒంగోలు నగర శివారులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని వెంకటేశ్వరకాలనీ శివారులో చేపల చెరువు వెంకటనారాయణ నివాసం ఉంటున్నాడు. ఆ పక్కనే ఓ రహస్య ప్రాంతాన్ని ఏర్పాటు చేసి కోళ్లు పెంచుతున్నాడు. అయితే ఆ ప్రదేశం కోడిపందేలు వేసేలా అనువుగా మార్చాడు. దాని చుట్టూ దీంతో వల్లి బయటకు కనిపించకుండా చేశాడు. ఆ ప్రదేశానికి చేరుకోవాలంటే తన ఇంటికి వెళ్లే మార్గం నుంచే వెళ్లాలి. ఎవరు ఆ దారిలో వచ్చినా సమాచారం అందేలా ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇక అక్కడ నిత్యం కోడిపందేలు వేయిస్తూ వారి వద్ద పందెనికి ఓ రేటు నిర్ణయించి వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో సమాచారం అందుకున్న తాలూకా సీఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేశారు. అక్కడ 24 మంది జూదరులు, 30 కోళ్లు, అలాగే వారి వద్ద నుంచి రూ.76 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని వెంటనే కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి జరిమానా విధించి పంపించి వేశారు.

మూడు లారీలు సీజ్

ఒంగోలు క్రైం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రామతీర్థం నుంచి రోడ్డు మెటల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి రాజశేఖర్ తెలిపారు. సోమవారం రాత్రి చీమకుర్తి మండలం రామతీర్థం నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా రోడ్డు మెటల్ తరలిస్తుండగా మైనింగ్‌శాఖ అధికారులు లారీలను పట్టుకుని సీజ్ చేశారు. అనంతరం వాటిని చీమకుర్తి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమంగా రోడ్డు మెటల్, గ్రానైట్ తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి : పీడీ

నాగులుప్పలపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులం షెడ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. వినోదరాయునిపాలెం గ్రామంలో జరుగుతున్న గోకులం షెడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. గోకులం షెడ్లకు 90 శాతం సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. పొలాల్లో నీటి నిల్వ చేసుకునేందుకు ఫైనాన్ కుంటలు తవ్వించుకునే పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఫైనాన్ కుంటలు, ఇంకుడుగుంతలు, గోకులం షెడ్ల లబ్ధిదారుల గుర్తింపు పనుల ఆమోదానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వైమహాలక్ష్మి, ఏపీవో రవిబాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

4నుంచి పరీక్షలు : డీఈవో

ఒంగోలు విద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-2 పరీక్షలు వచ్చే నెల 4వతేదీ నుంచి ప్రారంభమవుతాయని డీఈవో ఎ.కిరణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి ఎంశ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వతేదీ నుంచి ప్రతి రోజు పరీక్ష కేవలం రెండు పాఠశాలల్లో మాత్రమే జరుగుతుంది. 5న వ రీక్ష లేదు. 6నుంచి 8వ తేదీ వరకు రోజు రెండు పరీక్షలు నిర్వహిస్తారు. 2వతేదీన ప్రశ్నపత్రాలను మండల కేంద్రాలకు చేరుస్తారు. పరీక్షలను జాగ్రత్తగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను డీఈవో ఆదేశించారు.

చెరుకూరువాసికి డాక్టరేట్



మహేంద్ర

కొండపి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకూరు గ్రామానికి చెందిన కుంకు మహేంద్ర పాండిచ్చేరి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. వివిధ ప్రైవేటు కంపెనీల్లో పనిచేసిన అనుభవం ఉన్న మహేంద్ర 'కంపెనీల ఆర్థిక నియంత్రణ, పాలన మెరుగు' అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. అందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. గతంలో పలు కార్పొరేట్ స్కూళ్లలో గెస్ట్ ఫ్యాకల్టీగా కూడా మహేంద్ర పనిచేశారు.

జూదరుల అరెస్ట్

పొన్నలూరు (కొండపి), అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్లలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఏనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,220 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. చెన్నిపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.37,610 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై అనూక్ ఒక ప్రకటనలో తెలిపారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

ఒంగోలువిద్య, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : త్రోవగుంట జిల్లాపరిషత్ హైస్కూలును డీఈవో ఎ.కిరణ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయాన్నే పాఠశాలకు చేరుకున్న ఆయన ప్రార్థనా సమావేశాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హాజరు నమోదు, సెల్ఫ్ ఎసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 మార్కుల నమోదు, టీచింగ్, లెర్నింగ్ సామగ్రి వినియోగాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులకు ఎరువుల సరఫరా

ఒంగోలు(రూరల్), అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు చేసే రైతులకు ఒంగోలు పొగాకు బోర్డు వేలం కేంద్రం-2లో ఎరువులు సరఫరా చేస్తున్నట్లు నిర్వాహణాధికారి ఎం.సత్యశ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక వేలం కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎరువులు కావాల్సిన రైతులు ఇండెంట్ పెట్టుకోవాలని కోరారు. పొగాకు ఉత్పత్తిదారులు సమాఖ్య ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. డీఏపీ, అమ్మోనియం సల్ఫేట్, పోటాష్ రైతులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పెనుబోతు సునీల్, రైతులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులకు అంచనాలు

టంగుటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నీటి సంరక్షణ పనులకు అంచనాలను రూపొందించాలని ఏపీడీ వెంకటస్వామి ఆదేశించారు. కొండపి, టంగుటూరు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణ స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దేవసేనకుమారి, డ్వామా కోర్టు డైరెక్టర్ లలిత, ఏపీవో వెంకటస్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు ఏపీడీ సుబ్బారావు ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం అంతా కలిసి నల్లూరి వెంకటేశ్వర్లు గోకులం షెడ్డును పరిశీలించారు.

ఫసల్ బీమా షెడ్యూల్ విడుదల

టంగుటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌కు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన షెడ్యూల్ విడుదలైనట్లు ఏవో జె.సుబ్బారావు రైతులకు తెలిపారు. మండలంలోని జమ్ములపాలెం, కాటూరివారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో శనగ, వరి, జొన్న, మినుము, మిర్చి, మొక్కజొన్న పంటలకు మాత్రమే పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయమాధవి, సహాయకులు ఏఎఫ్‌వోలు హాజరయ్యారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని హైవే పక్కన ఉన్న ఒంగోలు జాతర దాబా వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బైకుల మీద వెనక కూర్చొని ఉన్న మహిళలకు గాయాలు కాగా 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



సంచారజాతుల వివరాలను సేకరించాలి

బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు ● ఎంపీడీవోలకు లేఖలు ● 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 28,232 మంది నివాసం

ఒంగోలు నగరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంచార జాతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. వారిని ఆర్థికంగా అభి వృద్ధిపరిచే దిశగా ప్రత్యేకంగా పథకాలను అమలు చేసేందుకు సిద్ధమయ్యింది. ఇందులో భాగంగా ముందుగా బీసీ(ఏ) లోని సంచార జాతుల పూర్తి వివరాలను సేకరించేందుకు చర్యలు తీసుకుంది. బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ వివరాలను సేకరించనుంది. ఈ మేరకు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, నగర కమిషనర్‌కు సమాచారం పంపించారు. బీసీ(ఏ)లోని 32 సంచాల జాతుల వివరాలను సేకరించి పంపించాలని కోరుతూ లేఖలు పంపారు. వచ్చే నెల 6వ తేదీలోగా ఈ వివరాలను అందజేయాల్సి ఉంది. ఆయా గ్రామాల్లోని, పట్టణాల్లోని సచివాలయాల సిబ్బంది ద్వారా వివరాలను సేకరించి పంపించాలని ఆదేశించారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధృవీకరణపత్రం లేకుండా సంచార జీవనం సాగిస్తున్న వారి వివరాలను సేకరించనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో జంగం, మొండివారు, మొండిబండ, బండ, గంగిరెద్దుల వారు, పాముల, వంశరాజు, పిచ్చిగుంట్ల, బుడబుక్కల, పత్రా, కొప్పుమరే, రెడ్డిక, దొమ్మర, దాసరి, కాటిపాపల, వీరముష్టి, నెట్టికోతల, వీ రభద్రీయ, రాజన్నల, రాజన్నలు, దమ్మల, దామల, పెదమ్మవాండ్లు, ఎల్లమ్మవాండ్లు, బందర, యాట, జోగి, చోపిమరి, గుడల, పరికిముగ్గుల, మందుల, మొండిపట్ల, కంజార, భట్ట, పంబల, జోషినందివాల, బలసంతు, బహురుపి, కొర్ప, కైకడి, కాసికాపడి, కాసికాపుడి, పర్ధి, నొక్కర్, కూనపులి సంచార జాతులకు చెందిన వారు 28,232 మంది ఉన్నారు. వీరి ప్రధానంగా భిక్షమెత్తుకోవటం, అటవీ ఉత్పత్తులను అమ్ముకోవటం, కొన్నిజాతులు నేరాల చేయటం, శ్మశానాల్లో కాపలా కాయటం, ఆయుర్వేద మందులు అమ్ముకోవటం వంటి వృత్తుల ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించివారి జీవనోపాధులను పెంపొందించే దిశగా ప్రభుత్వం పథకాలను వారికి అందించేందుకు చర్యలు తీసుకోనుంది.



వెల్లంపల్లిలో కొండచిలువ కలకలం



రోడ్డు దాటుతున్న కొండచిలువ

మద్దిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలోని జాతీయరహదారిపై మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో కొండచిలువ కలకలం రేపటింది. స్థానిక చిన్న బ్రిడ్జి వద్ద సుమారుగా 15 అడుగుల కొండచిలువ రోడ్డు దాటి పంట పొలాల్లోకి వెళ్లింది. దీనిని గుర్తించిన వాహనదారులు తమ వాహనాలను ఆపారు. దీంతో అది నిదానంగా వెళ్లిపోయింది.



వైన్‌షాపు ఓనర్లు నిబంధనలు పాటించాలి

● సీఐ సుబ్బారావు

చీమకుర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లైసెన్స్‌లను పొందిన వారు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదుచేసి జైలుకు పంపించాల్సి వస్తుందని చీమకుర్తి సీఐ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బెల్టుషాపులకు బాటిళ్లను విక్రయించినా, దుకాణం పక్కన పర్మిట్‌రూం ఏర్పాటు చేసినా, ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ రేటుకు విక్రయాలు జరిపినా, మద్యం విక్రయాలను నిర్ణీత వేళలను పాటించకపోయినా కేసుల నమోదు చేస్తామన్నారు. దుకాణాల పార్టనర్ల అందరిపై, దుకాణంలో పనిచేసే సిబ్బంది నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు చేపడతామన్నారు. రానున్న రో జుల్లో ఆకస్మిక దాడులు నిర్వహిస్తామన్నారు.




ఆహార నియమాలు పాటిస్తేనే ఆరోగ్యం

● మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆహార నియమాలు పాటించకపోవడం వల్లే అనారోగ్యానికి కారణమవుతుందని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రిమ్స్‌లోని ప్రివెటివ్ ఆంకాలజీ యూనిట్‌లో డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పొగతాగడం, వ్యాయమం చేయకపోవడం వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించడంతో పాటు వ్యాయమం తప్పని సరిగా చేయాలని చెప్పారు. రిమ్స్ సూపరిటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. అనంతరం నోరు, గర్భాశయ ముఖద్వారం, రొమ్ము క్యాన్సర్‌ను పరీక్షించే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రివెంటివ్ ఆంకాలజీ నోడల్ అధికారి బి.తిరుమలరావు, డిప్యూటీ మెడికల్ సూపరిటెండెంట్ నామినేని కిరణ్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ భగీరథి, ఆర్ఎంవో మాధవీలత, వైద్యులు శ్రీనివాసరెడ్డి, ప్రియాంక, సంధార్యాణి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.















ఫీడర్ కెనాల్ కట్టపై బైకుతో పర్యటిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు జనార్ధన్, ఉగ్ర, దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, కలెక్టర్‌అన్సారియా, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మంత్రి స్వామి

- ఫీడర్ కెనాల్ పరిశీలించేందుకు బైకులపై పర్యటన
- కనీస మరమ్మతులు కూడా లేకపోవడంతో ఆగ్రహం

మోటారుసైకిల్‌పై నేతల సవారీ

పెద్దదోర్నాల, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రుల బృందం మంగళవారం చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు సందర్శన పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రాజెక్టు సందర్శన జలవనరులశాఖదే అయినప్పటికీ వెనుకబడ్డ ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధిని కాంక్షించిన జిల్లా ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున అక్కడకు తరలివచ్చారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి 9 గంటలకే దోర్నాలకు వచ్చారు. అదేక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ కూడా రాత్రి 12 గంటలకు దోర్నాలకు చేరుకున్నారు. మంగళవారం ఉదయానికి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్‌లు కూడా వచ్చారు. టన్నెల్ సందర్శన అనంతరం ఫీడర్ కెనాల్‌ను పరిశీలించేందుకు కడపరాజుపల్లె సమీపంలోని పనుకుమడుగు గిరిజన గూడెం వద్దకు చేరుకున్నారు. అయితే రహదారి సక్రమంగా లేదు. రోడ్డంతా చిల్లకంపతో నిండి బైకులపై మాత్రమే ప్రయాణించే అవకాశం ఉంది. దీంతో మంత్రుల ఉత్సాహంతో అప్పటికప్పుడు కార్యకర్తల బైకులపై కరకట్టపై ప్రయాణించారు. ఈ క్రమంలో తొలుత స్థానిక కార్యకర్త బైకు నడుపుతుండగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెనుక కూర్చుని మిగిలిన వారికి ఉత్సాహాన్ని నింపారు. జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ఒక్కరే ఒక బైకును తీసుకుని కరకట్ట వెంబడి ముందుకు కదిలారు. తదనంతరం కందుల నారాయణరెడ్డి బైకు నడుపుతుండగా సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెనుక కూర్చున్నారు. దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మీ స్కూటీ నడపగా కలెక్టర్ తమీమ్ అన్సారియా వెనుక కూర్చున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ బైకు నడుపుతుంటే వెనుక కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర కూర్చున్నారు. మరొక కార్యకర్త మోటారుసైకిలుపై వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రయాణించారు. రయ్ మంటూ వారే స్వయంగా బైకులు నడుపుతూ కరకట్టపై ప్రయాణించారు.

ఫసల్‌బీమాను సద్వినియోగం చేసుకోవాలి



నాయుడుపల్లెలో పైర్లను పరిశీలిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్ అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి). రైతులు ప్రధాన మంత్రి పసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు కోరారు. మండలంలోని నాయుడుపల్లి, గజ్జలకొండ గ్రామాలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్ నుండి మినుము పంటకు ఎకరాకు రూ.103 రైతు వాటా కింద సీఎస్‌సీ ద్వారా ప్రీమియం చెల్లించాలని కోరారు. పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను అధికంగా వినియోగించాలని కోరారు. పంటలు సాగు చేయని సమయంలో పచ్చిరొట్ట పైర్లు సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి రమేష్, రైతుసేవా కేంద్రాల సిబ్బంది జయంతి, నవీన్, రైతులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

గిద్దలూరుటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రబీసీజన్‌లో సాగుచేసుకునే పంటలకు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన కింద రైతులు పంటబీమాకు ప్రీమియం చెల్లించాలని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గడికోట, ఆదిమూర్తిపల్లె గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో శనగ, మినుము, వరి, జొన్న, మొక్కజొన్న, ఎండుమిరప మొదలైన పంటలు పంటల బీమా పథకం కింద నమోదు చేసుకోవచ్చన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న 21 మంది కార్మికులను అక్రమంగా తొలగించారని వారిని విధుల్లోకి తీసుకోవాలని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు కార్మికులు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఆ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా కార్మికులు మున్సిపాలిటీలో పనిచేస్తున్నారన్నారు. వారిని తొలగించటంతో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఫోన్ ద్వారా విధుల్లో నుంచి తొలగించారన్నారు. సమస్యను పరిష్కరించకుండా తమ పరిధిలో లేదని దాటవేత ధోరణిని కమిషనర్ అవలంభిస్తున్నారన్నారు. తక్షణమే కార్మికులను విధులోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సోమయ్య, బాలనాగయ్య, సుబ్బరాయుడు, హరి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



సబ్‌జైలును పరిశీలిస్తున్న శ్యాంబాబు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సబ్‌జైలు నందు ఖైదీలకు అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు అన్నారు. ఆయన మంగళవారం గిద్దలూరులోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను, వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఖైదీలతో ఆయన మాట్లాడుతూ ఆవేశంతో నిర్ణయాలు తీసుకోవడం ద్వారా సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్రైవేటుగా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని అందిస్తామన్నారు. అందుకు సంబంధించి సంబంధిత న్యాయ సేవాధికార సంస్థకు జైలు అధికారుల ద్వారా అర్జీ పెట్టుకోవచ్చన్నారు. బెయిల్, ఉచిత న్యాయ సహాయం, న్యాయసేవాధికార సంస్థ చట్టం గురించి విచారణ ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని కమ్మరాంకుట్ట ప్రాంతంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి 24 క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని కుమ్మరాంకట్టలో కదిరి వెంకటరమణ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ సీఐ సురేష్ దుకాణంపై దాడి చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గ్రామసభలతో భూ సమస్యలకు పరిష్కారం

పొదిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామసభల ద్వారా భూసమస్యలు పరిష్కారించేందుకు వీలుం టుందని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళ వారం మండలంలోని కొండాయపాలెం గ్రామంలో సర్పంచ్ సన్నెబోయిన మాధవి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, గ్రామాల్లో పేరుకు పోయిన సమస్యలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో జరిగిన భూమి రీసర్వేల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



సీతానాగులవరంలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

భూసమస్యలు పరిష్కరిస్తాం

తర్లుపాడు : రీసర్వేలో జరిగిన అవకతవకలను గ్రామసభల్లో పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ విజయ భాస్కర్ అన్నారు. మండలంలోని సీతా నాగులవరంలో రీసర్వేపై భూసమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూములకు పాసుపుస్తకాలలో హెచ్చు తగ్గులున్నాయని అర్జీలు సమర్పించారు. వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీవాణి, గ్రామసర్పంచ్ తాడికొండ ఆంజనేయులు, వీఆర్వో ఆదినారాయణ, విలజ్ సర్వేయర్లు మస్తాన్‌వలి, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



శ్రీశైలంలో మంత్రి రవితోపాటు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఉగ్ర

మల్లన్నను దర్శించుకున్న మంత్రి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని మంగళవారం ఉదయం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డిలు దర్శించుకున్నారు. ఈసందర్భం గా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.



పోలీసుస్టేషన్‌లో తనిఖీ

గిద్దలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల పోలీసుస్టేషన్‌ను గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య తనిఖీ చేశారు. కేసు డైరీలను, రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి వెంటనే కేసులను పూర్తి చేయాలని ఎస్సై కోటేశ్వరరావుకు సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా, పారదర్శకంగా వ్యవహించాలన్నారు. సైబర్ నేరాలు జరుగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పేకాట, గంజాయి, గుట్కా అమ్మకాలు, బెల్టుషాపులపై నిఘా ఉంచాలని, అసాంఘీక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు.

ఓంకార్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

పొదిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బ్యాంక్ కాలనీలో మాదిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ ఓంకార్‌పై ఈ నెల 5న జరిగిన దాడి కేసులో పలువురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచిన విషయం తెలిసింది. అయితే ఈదాడిలో ప్రధాన నిందితుడు పొల్లా రమేష్ ఇప్పటి వరకు పరారీలో ఉన్నట్లు చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి వేమన తెలిపారు. అనంతరం పొదిలి కోర్టులో హాజరపరిచినట్లు చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గిద్దలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 30న బుధవారం ఉదయం 11 గంటల కు చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించ నున్నట్లు కమిషనర్ డి.వెంకటదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

గిద్దలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న విశ్వ బ్రాహ్మణ నాయకులకు నామినేటెడ్ పదవులలో ప్రభుత్వం అవకాశం కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు చెన్ను పల్లి శ్రీనివాసాచారి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణ లో జరిగిన విశ్వబ్రాహ్మణుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో విశ్వబ్రాహ్మణులకు సముచిత న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు రంగాచారి, దత్తాచారి, చంద్రశేఖరాచారి, వీరబ్రహ్మాచారి పాల్గొని ప్రసంగించారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

కొనకనమిట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల మండల ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించినట్లు ఆ సంఘం రాష్ట్రకౌన్సిలర్ ఎస్‌కే.ఖాదర్‌భాష తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులుగా తాళ్లూరి రామారావు, ప్రధాన కార్యదర్శి గా తోట యోగిరాములను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖాదర్‌భాష మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు యూనియన్ అభివృద్ధి కోసం కృషిచేయాలన్నారు. అంతేకాకుండా ఏదైనా సమస్య ఎదురైతే సున్నితంగా పరిష్కరించాలన్నారు.















దావా సమనులు OR 5 R1&5 of C.P.C
IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE:: KANIGIRI

O.S.No.324/2023

Pulivirti Saraswathi ... Plaintiff

-Vs-

Dhanenkula Kotaiah ... Defendant

To:-
Dhanenkula Kotaiah,
S/o. Koteswara Rao, House Number 6-695/1, Plat Number 39, New Ayyappa Nagar, Biside Netaji Nagar, Pamuru Village & Mandal of Prakasam District.

ధనెంకుల కోటయ్య గారికి పై నెంబర్ దావా పరిహారము పొందగోరి వాది మీ పైన దావా దాఖలు చేసియున్నారు. కనుక మీకు ఆక్షేపణలు ఉన్నచో **తేదీ:14-11-2024** పగలు 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది లేనిచో మీ పరోక్షము నందు వ్యాజ్యమును విమర్శ చేసి తీర్మానించబడునని తెలుపుకొనేది.

(By Court Order)

వాయిదా తేది:14-11-2024

ఇట్లు:
యం.రామసుబ్బారెడ్డి
వాది తరపు అడ్వకేట్, కనిగిరి
ప్రకాశంజిల్లా.
సెల్ నెం.9849737124

స్థలము: కనిగిరి
తేది.29-10-2024



టీడీపీ నాయకుడు హనుమంతరావు మృతి

గేదెల పోట్లాట.. వృద్ధుడికి ప్రాణ సంకటం



మృతుడు హనుమంతరావు

పామూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నుచ్చుపొద గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకులు దేవరపు హనుమంతరావు(71) మంగళవారం మృతి రోడ్డు ప్రమాదంలో చెందారు.నుచ్చుపొద గ్రామంలోని తన ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి జాతీయ రహదారి దాటుతున్న సమయంలో రోడ్డుపై వెళుతున్న గేదెలు పొడుచుకొంటూ వచ్చి బైక్‌ను బలంగా తగిలాయి. దీంతో హనుమంతరావు రోడ్డుపై పడ్డాడు. అతని తలకు రోడ్డు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. 108 వాహనంలో హాస్పిటల్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. హనుమంతరావు భార్య దేవరపు ఆదిలక్ష్మమ్మ నుచ్చుపొద గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పామూరులో కాకతీయ కమ్మసంఘం ఏర్పాటులో హనుమంతరావు కీలక పాత్ర పోషించారు. హనుమంతరావు అకాల మృతి పట్ల ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్, దారపనేని చంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, బైరెడ్డి జయరామిరెడ్డి, యారవ శ్రీనివాసులు, తిరివీధి జనార్దనరావులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వెలిగొండ నీటిని కనిగిరి ప్రాంతానికీ అందించాలి

ఆ ప్రాజెక్ట్‌పై గత వైసీపీ ప్రభుత్వం

పూర్తిగా నిర్లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



ఎమ్మెల్యే జనార్దన్‌తో కలసి బైక్‌పై వెలిగొండ ప్రాజెక్ట్ వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ జలాలు కనిగిరి ప్రాంతానికి అందించేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఇరిగేషన్‌శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయితే పశ్చిమ ప్రకాశంలో సాగు, తాగునీటి సమస్యను పూర్తిగా అధిగమించవచ్చన్నారు. కేవలం వర్షాల ఆధారంగానే సాగు చేసుకునే పరిస్థితి ఉండడం వల్ల వ్యవసాయ రంగం అనుకున్న స్థాయిలో పురోభివృద్ధి సాధించడం లేదని చెప్పారు. అంతేగాక తమ ప్రాంతంలో భూగర్భ జలాలు వృద్ధి చెంది ఫ్లోరిన్ మహమ్మారి నుంచి ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు దృఢ సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు.

ప్రాజెక్ట్‌ను సందర్శించిన పామూరు సీపీఐ శ్రేణులు

పామూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టును సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణతోపాటు పామూరు శ్రేణులు మార్కాపురం నాయకులు అందె నాసరయ్యతో కలిసి మంగళవారం సందర్శించారు. టన్నెల్ -2 ప్రాంతాన్ని పరిశీలించి పనుల జరిగిన తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, కే ప్రభాకర్, ఆకుల మోహన్‌రావు, ఆర్ నూరిబాబు, పీ రఘునాథరెడ్డి, ఇర్రి వెంకటరెడ్డి ఇమాం, టీడీపీ నాయకులు మితికెల నారాయణ, మాల్యాద్రి, సుబ్బారావు పందిటి శివశంకర్‌లు ఉన్నారు.



ప్రాజెక్ట్ టన్నెల్ వద్ద సీపీఐ శ్రేణులు

'మా గ్రామ భూములను రక్షించండి'

కురిచేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర వీరాయపాలెం 8వ సర్వేనంబరులో కొంతమంది ఆక్రమించి అమ్మకాలు చేయబోతున్నారని,ఆ భూములను కాపాడాలని పడమర వీరాయపాలెం గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయ డీటీకి మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొరిగర్ల గోవిందు, ఊట్ల వెంకటేశ్వర్లు, కె.సామ్యేలు, యాకోబు, ఏసయ్య, కె నాగేశ్వరరావు, ప్రసాదు, ఎర్రయ్య పాల్గొన్నారు.

సాగర్ కాలువలో పడి వ్యక్తి మృతి

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దర్శి-పొదిలి రోడ్డులో సాగర్ కాలువలో పడి మంగళవారం ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. దొనకొండ మండలం గుట్టమీదపల్లికి చెందిన అశోక్, శివకృష్ణ, వెంకటకృష్ణ తదితరులు కాలువ వద్ద విందు చేసుకున్నారు. అశోక్ అనే యువకుడు ఈత కొట్టేందుకు కాలువలో దిగాడు. సరిగా ఈత కొట్ట లేక దుర్మరణం చెందాడు. ఎస్సై ఎం మురళీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని దర్శి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పుట్టబజారు దగ్గర కె. చిరంజీవి అనే వ్యక్తి అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు ఎస్సై ఎం మురళీ సిబ్బందితో వెళ్లి అతని వద్ద ఉన్న 20 మద్యం బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేశారు.

పోలవరంలో అక్రమంగా ఉంచిన మద్యం పట్టివేత

ముండ్లమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలవరంలో తూమాటి అనిల్ బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు మంగళవారం సాయంత్రం సమాచారం అందటంతో ఎస్ఐ వై నాగరాజు తన సిబ్బందితో వెళ్ళి దాడి చేయగా 15 మద్యం క్వార్టర్ బాటిల్స్ పట్టుబడినట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బెల్టు షాపులు నిర్వహిస్తే నిర్వాహకుల పై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో వేములబండ గ్రామానికి చెందిన దార్ల అంజయ్యకు మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. ముండ్లమూరులో జరిగిన ఒక కార్యక్రమానికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో వాహనం అదుపు తప్పి బోల్తాకొట్టింది. గాయపడిన వ్యక్తిని బంధువులు ఒంగోలు తీసుకెళ్లారు.

చీరాల కోర్టు అమీనాకు ఏడాది జైలు, రూ.2లక్షల పరిహారం


కనిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి భరత్‌చంద్ర చీరాల కోర్టు అమీనాకు మంగళవారం ఏడాది జైలు, రూ.2లక్షలు నష్టపరిహారం విధించారు. కోర్టు వర్గాల తెలిపిన వివరాల ప్రకారం... చీరాల కోర్టు అమీనాగా పనిచేస్తున్న పాలపర్తి ప్రభాకర్‌రావు దర్శికి చెందిన దమావుల చిన్నవీరయ్య వద్ద రూ.2లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇవ్వగా చెక్కు బౌన్సు కావటంతో కోర్టును ఆశ్రయించాడు. ఈనెల 28న వాయిదాకు అమీనా గైర్హాజరవటంతో వెంటనే అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పెట్టాలని న్యాయాధికారి పోలీసులను ఆదేశించారు. దీంతో మంగళవారం పోలీసులు కోర్టులో హాజరుపరచగా నిందితుడు పాలపర్తి ప్రభాకర్‌రావుకు న్యాయాధికారి భరత్ చంద్ర ఏడాది పాటు జైలు, రూ.2లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

వరి పొలంలో కాలిబాటలు తీయాలి

కనిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరి పంటలో కాలిబాటలు తీసుకోవాలని ఏవో జ్యోత్స్నాదేవి చెప్పారు. మండలంలోని పోలవరం, చినఇర్లపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దానమ్మ, వీపీఏలు షబానా, సరస్వతి, ఏహెచ్‌లు శివ, హబీబ్ పాల్గొన్నారు.

సభ్యత్వంతో టీడీపీ కార్యకర్తలకు భరోసా

తాళ్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కలుగుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి చెప్పారు. తాళ్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకోవటం వల్ల రూ.5లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, షేక్ కాలేషావలి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాచకొండ వెంకట్రావు, ఐ.శ్రీనివాసరెడ్డి, పిన్నిక రమేష్, అనపర్తి సుబ్బారావు, మీరామొహిద్దీన్, డానీ, లక్ష్మీనారాయణ, కె.రామకోటిరెడ్డి, పి.రమణారెడ్డి, ఎఫ్రాయిమ్, మన్నం రామకోటయ్య పాల్గొన్నారు.





దర్శిలో టీడీపీ ఫ్లెక్సీలు చించివేత

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తెలుగుతమ్ముళ్లు

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలో టీడీపీ ఫ్లెక్సీలు చించివేసిన సంఘటన కలకలం రేగింది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను ఎవరో కోసి చించివేశారు. విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఫ్లెక్సీలు చించారని అనుమానిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా దర్శి పట్టణంలోని గడియారస్తంభం సెంటర్, ప్రధాన రహదారుల్లో టీడీపీ అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ వాటిని వేశారు. దర్శి-కురిచేడు రోడ్డులో డివైడర్లపై పెట్టిన తొమ్మిది ఫ్లెక్సీలను సోమవారం రాత్రి కోసి చించివేశారు. మంగళవారం ఉదయం చూసే సరికి చించి ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందుకు బాధ్యులెవరు అన్న విషయంపై దృష్టి సారించి విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. పోలీసులు అన్నీ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మీ ఫొటో ఉన్న ఫ్లెక్సీని కోసిన దుండగలు

పూరిమెట్ల పాఠశాలకు ప్రభుత్వ భూమి కేటాయిస్తాం

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ముండ్లమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూరిమెట్ల గ్రామంలో సర్వే నెంబరు 64/5, 6, 7, 10లో ఉన్న మూడెకరాల గ్రామ కంఠం భూమిని పాఠశాల నిర్మాణానికి అందజేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. ఇటీవల గ్రామస్థులు తమ గ్రామంలో ఉన్నత పాఠశాలకు అవసరమైన స్థలం లేదని, విద్యార్థులు ప్రస్తుతం ఉన్న పాఠశాలలో చాలీచాలని గదుల్లో చదువుతున్నారని, గ్రామానికి దగ్గరలో ఉన్న గ్రామ కంఠం భూమిని ఇవ్వాలని కోరటంతో మంగళవారం జేసీ వచ్చి ఆ భూమిని పరిశీలించారు. విశాలమైన గదులు నిర్మించుకోవటం వల్ల విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండదని జాయింట్ కలెక్టర్ అన్నారు. స్థలానికి సంబంధించి పనులను వెంటనే పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఎంపీడీవో జనార్దన్, ఎంఈవో సుబ్బారావు, మండల సర్వేయర్ కోటం రాజు, ఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి, వీఆర్వో బ్రద్రి గోపాలరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వర్లు, చొప్పరపు నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మస్తాన్‌రావు, చింతలపల్లి వెంకట స్వామి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పామూరు అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురం, పామూరు, వడ్డెపాలెంలో మంగళవారం ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి డోజర్‌తో రోడ్డు చదును పనులను టీడీపీ శ్రేణులు చేపట్టారు. పాలపర్తి రమణయ్య, అబ్బారెడ్డిరాజ పాల్గొన్నారు.



పీసీపల్లి ఏవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశరావు

పీసీపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా కె.ప్రకాశరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన దర్శి ప్రాంతంలో ఏఈఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పీసీపల్లికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన నేరేడుపల్లి, మురుగుమ్మి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పుల్లయ్య, వీఏఏలు అనిల్, సాయిప్రియ, రైతులు ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. దర్శిలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో దర్శి-కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఆవరణలోని ఖాళీ స్థలంలో నగర పంచాయతీ కార్యాలయ కొత్త భవనం నిర్మించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించేందుకు సమావేశం ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ స్టీవెన్, కమిషనర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యాన్ని అధిక ధరలకు అమ్మితే చర్యలు

పామూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మించి అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని సీఐ ఎం భీమానాయక్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మద్యం షాపుల నిర్వాహకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లో బెల్ట్ షాపులు నిర్వహించవద్దన్నారు. వచ్చే నెల 10 తేదీలోపు షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ కిశోర్‌బాబు పాల్గొన్నారు.

కనిగిరి విద్యార్థుల ప్రతిభ

కనిగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో కనిగిరి మండలం చింతలపాలెం హైస్కూల్ విద్యార్థుల జట్లు తృతీయస్థానం సాధించాయి. ఈ నెల 26, 27, 28 తేదీల్లో తెనాలిలో అండర్-14 ప్రకాశం జిల్లా జట్టులో చింతలపాలెం హైస్కూల్‌కు చెందిన కె.దీక్షిత, ఎం లక్ష్మీప్రసన్నలు బాలికల జట్టులో పాల్గొనగా, పీ నాగబాబు బాలుర జట్టులో ప్రతిభ చూపారు. వీరిని హెచ్‌ఎం కేవీ రామశర్మ అభినందించారు.

సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

పామూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా ప్రమాద బీమా రూ.5 లక్షలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు షేక్ గౌస్‌బాష చెప్పారు. 269 బూత్ ఇన్‌చార్జి పత్తుమస్తాన్ ఆధ్వర్యంలో సభ్యత్వాలను మంగళవారం ప్రారంభించారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

దర్శి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఐదుగురు పేద విద్యార్థినులకు రూ.35 వేలు విలువ చేసే సైకిళ్లను పంపిణీ చేశారు. డీటీ వెంకటేశ్వర్లు, రోటరీక్లబ్ అధ్యక్షుడు పానుగంటి కోటేశ్వరరావు, కార్యదర్శి నాగేశ్వరరెడ్డి ట్రెజరర్ నారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.















దావా సమనులు OR 5 R1&5 of C.P.C
IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE:: KANIGIRI
O.S.No.324/2023

Pulivirti Saraswathi ... Plaintiff

-Vs-

Dhanenkula Kotaiah ... Defendant

To:-
Dhanenkula Kotaiah,
S/o. Koteswara Rao, House Number 6-695/1, Plat Number 39, New Ayyappa Nagar, Biside Netaji Nagar, Pamuru Village & Mandal of Prakasam District.

ధనెంకుల కోటయ్య గారికి పై నెంబర్ దావా పరిహారము పొందగోరి వాది మీ పైన దావా దాఖలు చేసియున్నారు. కనుక మీకు అక్షేపణలు ఉన్నచో **తేదీ:14-11-2024** పగలు 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది లేనిచో మీ పరోక్షమునందు వ్యాజ్యమును విమర్శ చేసి తీర్మానించబడునని తెలుపుకొనేది.

(By Court Order)

వాయిదా తేదీ:14-11-2024

ఇట్లు:
యం.రామసుబ్బారెడ్డి
వాది తరపు అడ్వకేట్, కనిగిరి
ప్రకాశంజిల్లా.
సెల్ నెం.9849737124

స్థలము: కనిగిరి
తేదీ:28-10-2024







చర్యల్లేని పంచాయితీలు..!

గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేయడమే కాకుండా నిధులను దారి మళ్లించడంలో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడింది. వైసీపీ నేతలు చెప్పిన ప్రతి దానికి పంచాయతీ కార్యదర్శులు అడ్డగోలుగా తలూపడంతో పంచాయతీలమీద పడి దోచేశారు. వైసీపీ నేతల ఒత్తిళ్లతో నాలుగు గ్రామాలకు చెందాల్సిన నిధులు ఓకే పంచాయతీకి మళ్లించారు. మరో గ్రామంలో దాదాపు రూ.1.73 కోట్ల నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలపై విచారణ...ఇంకో పంచాయతీలో అక్రమాలు చేసిన కార్యదర్శి బదిలీపై వెళ్లిన రెండేళ్ల తర్వాత అక్రమాలు వెలుగులోకి...ఇలా జిల్లాలో ఉన్న దాదాపు 30 పంచాయతీల్లో నిధుల విషయంలో గోల్‌మాల్ జరిగినట్లు గత ప్రభుత్వంలో ఆరోపణలు వెల్లువెత్తాయి.

వైసీపీ ఐదేళ్ల ఏలుబడిలో పంచాయతీల్లో అక్రమాలు

కూటమి ప్రభుత్వం రాగానే కొన్ని చోట్ల విచారణకు ఆదేశం

నివేదికలతో సరి....చర్యల ఊసే కరువు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధకారంలోకి రాగానే పంచాయతీలలో జరిగిన అక్రమాలపై సత్వర విచారణ చేపట్టడంతో పాటు ఒత్తిడి చేసిన వైసీపీ నేతలతో పాటు సంబంధిత ఉద్యోగులపై చర్యలుంటాయని అందరూ భావించారు. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా నిధుల రికవరీ ఊసే లేకపోగా ఏదో ఒకరిద్దరిపై మొక్కుబడి చర్యలతో మమ అనిపించారు. కొన్ని పంచాయతీలో పరిధిలో నివేదికలు కమిషనరేట్‌లో ఉన్నాయని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీలను కామధేనువుగా మార్చుకుని అక్రమాలకు పాల్పడిన వారందరిపైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది

నివేదికతో సరి...ఇంతవరకు అతీగతీ లేదు...

బల్లికురవ మండల పరిధిలోని గ్రానైట్ క్వారీల రాయల్టీ భారీ మొత్తంలో వస్తుంది. ఈ ఆదాయాన్ని ఆ క్వారీలు విస్తరించి ఉన్న నాలుగు పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేయాలన్న నిబంధన ఉంది. కానీ ఈ రివాజును కాదని వైసీపీ నేతల ఒత్తిళ్లతో నాలుగు గ్రామాలకు దక్కాల్సిన రూ.1.40 కోట్లను ఒకే పంచాయతీకి మళ్లించారు. ఈ బాగోతం బల్లికురవ మండలం కొణిదెన గ్రామంలో వైసీపీ హయాంలో జరిగింది. నిబంధనలను ఉల్లంఘించి నిధులు మళ్లించడంలో అప్పటి డీపీవోనే కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ఈ ఏడాది జూన్ 12న ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సమగ్రంగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అప్పుడు విధుల్లో ఉన్న డీపీవో రవికుమార్‌కు బాధ్యతలు అప్పజెప్పింది. నిధులు మళ్లింపు జరిగినప్పుడు డీపీవోగా ఉన్న అధికారి వివరణతో పాటు పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర నివేదికను జూన్ చివరిలోనే పంపించడం జరిగింది. ఇక అంతే ఇప్పటి వరకు దానిపై కదలికే లేదు

ఇష్టారీతిన అక్రమాలు...

ఇంకొల్లు గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు రూ.1.05లక్షలు నిధులు దుర్వినియోగం మీద విచారణకు ఆదేశించారు. అదే విధంగా పలెకోన పంచాయతీ కింద రూ.13.20 లక్షల నిధులు దోచేసినట్లు వచ్చిన ఆరోపణలమీద కూడా విచారణ చేపట్టగా మొక్కుబడి చర్యలుగా ఓ సర్పంచ్‌కు చెక్‌పవర్ రద్దుతో సరిపెట్టారు తప్పితే సిబ్బంది మీద చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. నిధుల రికవరీ ఊసే లేకుండా పోయింది. ఇక భట్టిప్రోలు, పడమర బాపట్ల పంచాయతీ పరిధిలో పెద్దఎత్తున పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదులు రాగా విచారణ కొనసాగుతూనే ఉండడం గమనార్హం

మరికొన్ని పంచాయతీలది ఇదే దారి...

జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 పంచాయతీల్లో నిధుల అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో పాటు ఆడిట్ నివేదికల్లోనే ఇదే అంశం వెల్లడయినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల్లోని అవకతవకలపై ఎవరైనా ఫిర్యాదు చేసిన వాటిని బుట్టదాఖలు చేయడం తప్పితే విచారణ జరిపి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే అప్పటి ఫిర్యాదులపై దృష్టి పెట్టి విచారణకు ఆదేశించింది. కానీ ఆడిట్ లెక్కల్లో కూడా కొన్ని పంచాయతీల్లో అవకతవకలు బహిర్గతమయ్యాయి. వీటన్నింటిపై అంతర్గతంగా శాఖాపరమైన విచారణకు ఆదేశించిన పంచాయతీ విభాగం వాటి విషయంలో కూడా గోప్యత పాటిస్తూనే ఉండడంతో విచారణ సారాంశం ఏంటి...చర్యలు ఏం తీసుకోబోతున్నారనే దానికి సమాధానమే కరువయింది. వైసీపీలో పంచాయతీలను ఇష్టారాజ్యంగా దోచేసిన అందరిపైనా చట్టపరంగా కూటమి ప్రభుత్వంలో చర్యలుంటాయని ఆశించిన వారికి విచారణలు, నివేదికలు దశలోనే ఆగిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

పంచాయతీలను ఖాళీ చేసేశారు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరే నాటికి జిల్లాలో ఉన్న పంచాయతీలన్నీ కూడా ఖాళీ ఖాతాలతోనే దర్శనమిచ్చాయి. అడ్డగోలుగా నిధులను దారి మళ్లించుకుని కొంతమంది వైసీపీ నేతలు జేబులు నింపుకుంటే కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చే నిధులను దారి మళ్లించి గ్రామాలలో అభివృద్ధి జాడే కానరాకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. కేంద్రం మే నెలలోనే రెండు విడతలుగా నిధులను పంచాయతీలకు జమ చేసింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న కరెంటు బిల్లులు కట్టడానికి మళ్లించింది. మిగిలిన సొమ్మును పంచాయతీలకు జమ చేస్తున్నామని చెప్పినప్పటికీ ఆ పని చేయలేదు

నిధులు రికవరీ చేసి....అభివృద్ధికి వినియోగించాలి...

జిల్లాలో పలు పంచాయతీల్లో వైసీపీ నేతల చేతివాటానికి తోడు సిబ్బంది సహకారంతో దాదాపు రూ.15 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి వాటి ఆధారంగా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం ఎంత అవసరమో, నిధులను రికవరీ చేయడంపై కూడా కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. వాటన్నింటిని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించాలనే డిమాండ్లు కూడా ప్రజల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కునారిల్లిపోయిన పంచాయతీలకు జవసత్వాలు కల్పించడంతో పాటు అక్రమాలపై సత్వర విచారణ జరిపి చర్యలకు ఉపక్రమించి అవినీతికి పాల్పడితే కఠిన చర్యలుంటాయనే సంకేతాలను పంపించాల్సిన అవసరం ఉంది

చిన్న మిల్లులకు.. పెద్దపీట

సీసీఐ జిన్నింగ్ మిల్లుల ఎంపికపై దుమారం

కావాల్సినట్లు నిబంధనలను మార్చేశారని విమర్శలు



గుంటూరులో ఎల్-1ని తప్పించి జిన్నింగ్ కోసం ఎంపిక చేసిన ఎల్-3 మిల్లు

గుంటూరు సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి జిన్నింగ్‌కు ఒక్కో బేలుకు రూ.1350 చొప్పున మిల్లర్లకు చెల్లిస్తుంది. అందుకు పెద్ద, చిన్న పత్తి మిల్లుల యజమానులు ఒప్పుకుని బిడ్డింగ్ వేశారు. ఈ క్రమంలో ఎక్కువ మిషన్లు కలిగి, అధిక సౌకర్యాలు ఉన్న మిల్లులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా తగిన సామర్థ్యం లేకున్నా.. సౌకర్యాలు లేని చిన్న మిల్లులకు సీసీఐ అధికారులు పెద్దపీట వేశారు. కావాల్సిన వారి మిల్లులను ఎంపిక చేసేందుకు కొందరిని పక్కకు తప్పించారన్న విమర్శలున్నాయి. జిన్నింగ్ మిల్లుల ఎంపికపై దుమారం చెలరేగుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు ఆగస్టులో ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రంలో ఇంగ్లీషు ప్రకటన వెలువడటం మొదట్లోనే వివాదమైంది. తెలంగాణలో సుమారు 390 మిల్లులను జిన్నింగ్‌కు ఎంపిక చేశారు. ఇక్కడ కేవలం 30 కేంద్రాలనే ఎంపిక చేశారు. గత ఏడాది సుమారు 70 పత్తి మిల్లులను ఎంపిక చేయగా ఈ ఏడాది అందులో సగం కూడా చేయలేదు. మిల్లులు ఎందుకు తగ్గించారో అధికారులు సరిగా వివరణ ఇవ్వలేదు. జిన్నింగ్‌కు ఒక్కో బేలుకు రూ.1350 ఇస్తామని సీసీఐ ఆఫర్ చేసింది. తెలంగాణలో అందరికీ అదే ధర చెల్లిస్తుంది. ఇక్కడ మాత్రం మిల్లర్లు తగ్గింపు ధరకు వేసేలా కొందరు బయ్యర్లు ప్రోత్సహిం చినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిన్నింగ్ కోసం మిల్లులు ఎంపికలో సామర్థ్యాన్ని బట్టి ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. ఎంపికలో మొదటి ప్రాధ్యానం ఎల్-1కే ఇవ్వాలి. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా వసతులు లేని, కనీసం ఐదు లారీల పత్తి కూడా పట్టని మిల్లులకు పెద్దపీ ట వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంపికలో గోల్‌మాల్ జరిగినట్లు మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బిడ్డింగ్ ప్రక్రియ మొదలైన తర్వాత ఆన్‌లైన్‌లో నిబంధనలను పలుమార్లు మార్చినట్లు చెబుతున్నారు. టెండర్లు వేశాక నిబంధనలు మార్చుతూ రావడంలోనే లోపాయకారి వ్యవహారం ఉన్నట్లు అర్థమవుతుందని ఆరోపించారు.

ఉత్తుత్తి కేంద్రాలే..

పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా సీసీఐ వ్యవహరిస్తుందన్న ఆరోపణలున్నాయి. ధర లేక రైతులు అల్లాడుతున్నా సీసీఐ మాత్రం కొనుగోలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలున్నాయి. గుంటూరు జిల్లాలో ఐదు పత్తి కేంద్రాలు సోమవారం నుంచి తెరిచినట్లు చెబుతున్నా ఒక్క కిలో పత్తి కూడా కొనుగోలు చేయలేదు. అసలు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తెరిచిందన్న సమాచారం రైతులకు తెలియదు. సాధారణంగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను పిలిచి ప్రారంభించాలి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రజాప్రతినిధికి కూడా సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై సమాచారం లేదు. గుంటూరు హౌసింగ్ బోర్డ్ సమీపంలోని కేంద్రం వద్ద కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదంటే అధికారులకు కొనుగోళ్లపై ఏపాటి ఆసక్తి ఉందో తెలుస్తోంది.

జిల్లా ఓటర్లు 12,95,686

ముసాయిదా జాబితా విడుదల

32,554 ఓట్ల పెరుగుదల

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ–2025 కార్యక్రమంలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 12,95,686గా ఈసీ తెలిపింది. ఇందులో పురుషులు 6,33,912 కాగా, మహిళల సంఖ్య 6,61,694గా, థర్డ్ జెండర్‌ను 80గా ఈసీ ప్రకటించింది. కలెక్టరేట్‌లో రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ముసాయిదా ఓటర్ జాబితాను విడుదల చేశారు. ఈసీ ఆదేశాల మేరకు ప్రచురించిన ముసాయిదా జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటి స్వీకరణకు నవంబరు 28 వరకు గడువు ఇచ్చారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నవంబరు 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటర్ల చేర్పులు, మార్పులకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిసెంబరు 24 వరకు వచ్చిన అభ్యర్థనలను పరిశీలించి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పిస్తారు. జనవరి 6న తుది జాబితాను విడుదల చేసేలా ఈసీ షెడ్యూల్ ప్రకటించింది

2023 ముసాయిదా జాబితాతో పోలిస్తే...

2023 అక్టోబరులో ఈసీ విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం బాపట్ల జిల్లాలో మొత్తం 12,63,132 ఓటర్లుండగా ఇందులో పురుషుల సంఖ్య 6,17,095 కాగా, మహిళల వాటా 6,45,962గా ఈసీ ప్రకటించింది. దీంతో ప్రస్తుతం ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్యలో 32,554 ఓట్ల వృద్ధి నమోదైంది. గతేడాది, ఇప్పుడు పురుషులతో పోలి స్తే మహిళల ఓట్లే అధికంగా ఉండడం గమనార్హం.

మంగళవారం విడుదల చేసిన ముసాయిదా ప్రకారం	
జిల్లాలోని మొత్తం ఓటర్ల సంఖ్య	12,95,686
పురుషులు	6,33,912
మహిళలు	6,61,694
థర్డ్ జెండర్	80

తల్లికి టాబ్లెట్లు తీసుకొస్తూ.. తిరిగిరాని లోకాలకు

- మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కంటైనర్
- బైకును 500 మీటర్ల ఈడ్చుకెళ్లిన లారీ
- వెంబడించి నిలిపేసిన వాహనచోదకులు



కంటైనర్ లారీలో ఇరుక్కున్న మోటార్‌సైకిల్



బ్రహ్మయ్య

అద్దంకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి, అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి అవసరమైన టాబ్లెట్‌లను తీసుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్న బొనిగల బ్రహ్మయ్య (40)ని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అద్దంకి మండలంలోని విప్పర్లవారిపాలెంకు చెందిన బొనిగల బ్రహ్మయ్య బేల్దారి పనులు చేయడంతో పాటు పొగాకు బ్యారన్ పచ్చాకు పనికి కూడా వెళ్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం అద్దంకి వచ్చిన బ్రహ్మయ్య ఏటీఎంలో 20వేల రూపాయల నగదును డ్రా చేసుకొని అనారోగ్యం తో బాధపడుతున్న తల్లి శాంతమ్మకు అవసరమైన టాబ్లెట్‌లను తీసుకొని ఇం టికి వెళ్తుండగా బలరామకృష్ణాపురం (ధేనువకొండ పునరావాసకాలనీ) క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. రోడ్డు మార్జిన్‌లో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న బ్రహ్మయ్యను కంటైనర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే లారీ కింద పడిపోయి తల చిద్రమైంది. మోటార్‌సైకిల్ కంటైనర్‌లో ఇరుక్కోగా సుమారు 500 మీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. నిలపకుండా వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి గమనించిన వాహనచోదకులు వెంబడించి నిలిపివేశారు. ఏటీఎంపై ఉన్న అడ్రస్ ఆధారంగా బ్రహ్మయ్య గా గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. ఎస్సై ఖాదర్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్రహ్మయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ మృతి

వేటపాలెం(చీరాల), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెంలో మంగళవారం విద్యుత్ షాక్ కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ మృతి చెందారు. ఇతను చల్లారెడ్డిపాలెం పంచాయతీలో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

చినగంజాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోత) : గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ శీలం రమేష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం గొనసపూడి గ్రామ సమీపంలోని కొమ్మమూరు కాలువ పరిధిలోని పంట కాలువలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కాగా, ఆ వ్యక్తి ఆచూకీ గుర్తించినట్లు తెలిపారు. మృతదేహం శరీరం మీద ఉన్న చొక్కా కాలర్‌పై ఉన్న దర్జీ వివరాల ఆధారంగా మృతి చెందిన వ్యక్తి కర్లపాలెం మండలం యాజిలి గ్రామానికి చెందిన యంపరాల వెంకటేశ్వర్లు(83)గా గుర్తించినట్లు తెలిపారు. అతనికి ఇద్దరు కూమార్తెలు, కుమారుడు ఉన్నారు. మనవడు దగ్గర ఉంటూ గత 15 రోజుల కిందట ఆ ప్రాంతంలోని కాలువలో ప్రమాదవశాత్తు పడి కొమ్మమూరు కాలువ ద్వారా గొనసపూడి ప్రాంతానికి కొట్టుకొని వచ్చినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

చీరాలటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల - వాడరేవు రోడ్డులోవాకావారిపాలెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వాకావారి పాలెం వద్ద లారీను ఓవ్యక్తి రోడ్డు పక్కన నిలిపి బహిర్భూమికి వెళ్లాడు. అయితే రాత్రి సమయం కావడంతో స్కూటీతో వెనుక నుంచి లారీ పక్కకు వచ్చిన యువకులు ముందు చక్రాన్ని వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో కఠారిపాలెంకు చెందిన వాయుల రాము, అడవిపల్లెపాలెంకు చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడగా, మరోవ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరినీ మెరుగైన వై ద్యం కోసం గుంటూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరక ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దీపావళి నిబంధనలు పాటించాలి

టూటౌన్ సీఐ నాగభూషణం



చీరాలటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ నాగభూషణం హెచ్చరించారు. బాణసంచా క్రయ, విక్రయాలు, నిల్వ ప్రదేశాలలో జాగ్రత్తలు పాటించాలన్నారు. లేకుంటే ప్రాణాపాయ ఘటనలు చోటుచేసుకుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అవగాహన లేమితో ప్రమాదాలకు కారకులు కారాదని సూచించారు. తప్పనిసరిగ్గా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. గోడౌన్, తదితర నిల్వలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనుమతులు తప్పనిసరి



పర్చూరు : దీపావళి టపాసుల అమ్మకాలకు అనుమతులతోపాటు, అధికారులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే అమ్మకాలు జరపాలని మార్టూరు రూరల్ సీఐ జీఎల్ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బాణసంచాను విక్రయించాలన్నారు. పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా దీపావళి మందులు విక్రహిస్తే అట్టివారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామ శ్రీనివాసరావు హెచ్చరించారు.

7 దుకాణాలకు అనుమతి

అద్దంకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా బాణసంచా అమ్మకాలకు సంబంధించి 7 దుకాణాలకు తాత్కాళిక అనుమతులు ఇచ్చారు. ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధ, గురువారాల్లో బాణసంచా అమ్మకాలకు 7 గురుకి అనుమతులు ఇచ్చారు.

దళిత రైతు ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

అద్దంకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దళిత రైతు చింతల శ్రీను ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ భవన్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బల్లికురవ మండలం చిన్న జమ్ములమడకకు చెందిన శ్రీను కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, మాలమహానాడు అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రవి, పులి వికాస్, అక్కయ్య, వెంకటేశ్వర్లు, యోగయ్య, శ్రీను పాల్గొన్నారు.

కంభం ఎస్‌డీసీగా శివరామిరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు కంభం ఆర్‌అండ్‌ఆర్ యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మాదాల వెంకట శివరామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

బాబు మాటలు.. అక్రమార్కులకు బంగారు బాటలు

- అనుమతి పేరుతో ఇసుక అక్రమ తవ్వకాలు
- జోరుగా సాగుతున్న దందా
- ఉచిత ఇసుక విధానానికి తూట్లు
- ఎన్‌జీటీ నిబంధనలు పాటించని వైనం
- అధికారులను బెదిరిస్తున్న అమ్మకందారులు



టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన ట్రాక్టర్ యజమానులు



ఎర్రగేటు సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్రాక్టరు

చీరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఏకంగా అక్రమార్కులు అధికారులను బెదిరిస్తున్నారు. తాము చేసేది అక్రమ క్వారీయింగ్ అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక ఉచితం అని చెప్పారంటూ అక్రమార్కులు వితండవాదం చేస్తున్నారు. తాజాగా టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద అక్రమార్కులు నిరసనకు దిగడం వారి తెంపరితనానికి నిదర్శనం. ఎవరన్నా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకున్న సమయాల్లో సీఎం చంద్రబాబు చెప్పారు. మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారని అక్రమార్కులు అతి తెలివిని ప్రదర్శిస్తున్నారు. ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్) నిబంధనలకు పాతరేస్తున్నారు. దీనికి సంబంధించి కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఉచిత ఇసుక విధానానికి తూట్లు పడి ప్రభుత్వానికి మచ్చపడక తప్పదు.

సీఎం ఏం చెప్పారు.. ఏం జరుగుతోంది

నదీ పరీవాహక ప్రాంతాలు, వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులు తమ అవసరానికి అనుగుణంగా నిర్ణీత షరతులతో ఇసుకను తరలించుకోవచ్చని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే అక్రమార్కులు ఆ మాటలకు విపరీతార్థాలను తీస్తూ అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో అధికారులు డోలాయనంలో పడుతున్నారు. చీరాల, వేటపాలెం, పర్చూరు నియోజకవర్గంలో చినగంజాం మండలాల పరిధిలో సహజసిద్ధంగా ఇసుక భూముల ఉన్నాయి. ఆ భూములలో పలువురు అక్రమార్కులు ఉచిత ఇసుక విధానానికి గండి కొడుతున్నారు. వాస్తవానికి ఈ పరిధిలో అధికారిక ఇసుక రీచ్‌లు లేవు. నదీ పరీవాహక ప్రాంతాలు కావు. ఇసుకను తవ్వే వాగులు, వంకలు లేవు.

ఎక్స్‌కవేటర్లతో తవ్వి తరలిస్తున్నారు

చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో అక్రమార్కులు ఏకంగా ఎక్స్‌వేటర్లతో ఇసుకను అక్రమ తవ్వి, రవాణా సాగిస్తున్నారు. ఇది వారి బరితెగింపునకు పరాకాష్ట. తమకు రాజకీయ అండ ఉందని కొందరు అధికారులనే బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. నియంత్రించాల్సిన ఆయా శాఖల అధికారులను అక్రమార్కులు బెదిస్తున్నారు. దీంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఎక్కడెక్కడ

చీరాల, బాపట్ల మండలాల సరిహద్దుల్లో ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలను సాగిస్తున్నారు. అక్కడ గతంలో బాపట్ల నియోజకవర్గ వైసీపీ ముఖ్య నాయకుడి అనుచరునిగా ఉన్న వ్యక్తి, ప్రస్తుతం చీరాల నియోజకవర్గ ముఖ్య నాయకుడితో అంటకాడుతున్నాడు. అతను తన పరిధిని విస్తరిస్తున్నాడు. దీంతో పాటు ఈపురుపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, కీర్తివారిపాలెం, స్ట్రయిట్‌కట్ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. వేటపాలెం మండల పరిధిలో పాపాయిపాలెం, వేటపాలెం, పందిళ్లపల్లిలో కొందరు ద్వితీయ శ్రేణినాయకులు, చినగంజాం మండల పరిధిలో కవడకుదురు, మోటుపల్లి పంచాయతీల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి.

పది నిమిషాలు హైవే మీద చూస్తే చాలు

పది నిమిషాలు జాతీయ రహదారిపై నిలుచుకుంటే సంబంధిత అధికారులకు చూస్తే అక్రమ ఇసుక రవాణా కనపడుతుంది. దందా గుట్టు రట్టు అవుతుంది. అధికారులు ఆ పని చేయడం లేదు. దీనికి అధికార అండే కారణమన్నది బహిరంగ రహస్యం.

అక్రమార్కులు ఎవరెవరు?

గతంలో బాపట్ల నియోజఎవకర్గ బాధ్యుడికి ముఖ్య అనుచునిగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం చీరాల, బాపట్ల మండలాల సరిహద్దుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగిస్తున్నాడు. ఇప్పటికీ ఎలాంటి అనుమతులు లేవు. వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన వ్యక్తి గతంలో వైసీపీతో అంటకాగి, ఇప్పుడు టీడీపీతో జతకట్టి దందా సాగిస్తున్నాడు. అవసరమైతే అధికారులను బెదిరించే స్థాయికి ఎదిగాడు. పందిళ్లపల్లి తదితర ప్రాంతాల్లో ముఖ్యనేత అనుచరుడు ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నాడు. చినగంజాం మండల పరిధిలో మాజీ ప్రజాప్రతినిధి సోదరులు ఇరువురు, సిలికా ముసుగులో కడవకుదురుకు చెందిన ఓ వ్యక్తి పోటీపడి దందా సాగిస్తున్నారు. అందుకు అధికార పార్టీ అండ ఉందనేది ఆరోపణ.

ఎవరికిచ్చేది వారికి ఇస్తున్నాం

కొందరు పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. దీన్ని నియంత్రించడం అధికారులకు తలకు మించిన పని అవుతోంది. ఎవరన్నా అడ్డుకుంటే సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో పాటు మీడియాను ప్రసన్నం చేసుకున్నామని చెప్పడం వారి తెంపరితానికి నిదర్శమని విషయం తెలిసినవారు అంటున్నారు.

అక్రమార్కులను ఉపేక్షించం



ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని ఎవరు అతిక్రమించినా ఉపేక్షించం. అందుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశాం. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉచిత ఇసుక భంగం కలిగిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. నేను కొత్తగా ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్నాను. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటా. ఇప్పటికే హెచ్చరికలు చేశాం.

- చంద్రశేఖరనాయుడు, ఆర్డీవో, చీరాల

రూ.1.75కోట్లతో ఆధునికీకరణ

- రావినూతలతో కొత్త విద్యుత్ లైన్
- ఈఈ మస్తాన్‌రావు
- అధికారుల సమక్షంలో మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎస్సీకాలనీవాసులు



రావనూతలలో నూతనంగా నిర్మించిన విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు, ఎస్సీకాలనీవాసులు

మేదరమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావినూతలలో రూ.కోటీ 75లక్షల ఖర్చుతో ఆధునికీకరణ పనులు చేపట్టామని విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మంగళవారం రాత్రి రావినూతల ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను అధికారులు, గ్రామస్థులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎత్తు తక్కువలో ఉన్న విద్యుత్ లైన్లను తొలగించి, కొత్త లైన్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 450 స్తంభాలు, నూతన లైన్లు, మూడు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం చేపట్టామన్నారు. 40 సంవత్సరాలకు పూర్వం వేసిన విద్యుత్ లైన్లు ఎత్తు తక్కువగా ఉండడంతో వాటి స్థానంలో కొత్త లైన్లను వేశామన్నారు. వీటితోపాటు రావినూతల సబ్ స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఇతర గ్రామాల్లో దశలవారీగా పాత స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ దామోదర్, ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు కారుసాల నాగేశ్వరరావు, (బాబు), గురుబాబు, ఆర్.శ్రీనివాస్, చేబ్రోలు నాగేశ్వరావు, కావూరి పెదఅంజయ్య, బడుగు కోటేశ్వరరావు, పాస్టర్ శ్యాంబాబు పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

ఎన్నో ఏళ్లుగా ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఇబ్బంది పడ్డామని, మీ దయతో ఎస్సీ కాలనీ అంతా పట్టణంలో మాదిరిగా విద్యుత్ వెలుగులతో కళకళలాడుతుందని ఎస్సీ కాలనీవాసులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్‌లో కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రాత్రి అధికారులు ఎస్సీ కాలనీకి వచ్చిన సందర్భంలో కాలనీవాసులు వారి సమక్షంలోనే మంత్రికి ఫోన్‌చేసి కృతజ్ఞతలు తెలిపడంతోపాటు కొత్తలైన్లు వేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

- 2390 మంది హాజరు
- వివిధ కంపెనీలకు 825 మంది ఎంపిక
- ఉపాధి కల్పనే ఏకైక లక్ష్యం
- మంత్రి గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్



నియామక పత్రాలను అందజేస్తున్న హర్షవర్ధన్

అద్దంకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో మంగళవారం అసిస్ట్, నిపుణ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నియోజకవర్గంలోని 2390 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలైన జెన్‌ప్యాక్ట్, అక్సెంచర్‌తో పాటు 36 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా కంపెనీలకు 525 మంది ఎంపిక కాగా హర్షవర్ధన్ నియామక పత్రాలను అందజేశారు. 300 మందిని రెండవ రౌండ్ ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గం లోని నిరుద్యోగయువతకు ఉపాధి చూపడమే ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. జాబ్‌మేళాలో పాల్గొన్న కొంత మందికి ఉద్యోగ అవకాశాలు రాకపోయినా నిరుత్సాహపడకుండా తిరిగి ప్రయత్నించాలన్నారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ పై మొదటి సంతకం చేసి 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీపై మొదటి సంతకం చేశారన్నారు. రాబోయే రోజులలో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఈవోపీఆర్‌డీ ప్రసాదరావు, అసిస్ట్ సంస్థ ప్రతినిధులు జాష్టి కృష్ణహరీష్, విష్ణు ప్రియ, పలు కంపెనీల ప్రతినిధులు, టీడీపీ నేతలు కరి పరమేష్, చిన్ని శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కుందారపు రామారావు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరైన యువతతో పాటు వారితో పాటు వచ్చిన కుటుంబసభ్యులకు భోజనం ఏర్పాటు చేశారు.



ఎంపికైన యువతతో వివిద కంపెనీల ప్రతినిధులు

నేడు కూటమి పార్టీల సంయుక్త సమావేశం

హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం

ఒంగోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అధికార కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జిల్లాస్థాయి నేతల సంయుక్త సమావేశం బుధవారం ఒంగోలులో జరగనుంది. స్థానిక భాగ్యనగర్‌లోని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లడం, మూడు పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా సర్దుబాటు, నామినేటెడ్ పదవులు ఇతరత్రా విషయాల్లో సమన్వయంతో పనిచేసేలా జిల్లా స్థాయిలో ఇలాంటి సమావేశాల నిర్వహణకు రాష్ట్ర పార్టీలు నిర్ణయించాయి. ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో వాటిని నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా బుధవారం ఒంగోలులో నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ పార్టీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ నుంచి మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలు జనసేన, బీజేపీల జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొంటారని సమాచారం. కాగా ఇన్‌చార్జి మంత్రి ఆనం బుధవారం ఉదయం 9 గంటలకు రామనగర్‌లోని ఎంపీ మాగుంట కార్యాలయానికి చేరుకొని అనంతరం టీడీపీ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరుకానున్నారు.

ముఖాముఖి

సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో లేకుంటే చర్యలు

ఆంధ్ర్యజ్యోతితో ఎంపీడీవో కుసుమకుమారి



కుసుమకుమారి
ఎంపీడీవో, బల్లికురవ

ప్రశ్న : గ్రామ సచివాలయాలలో ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు అంటున్నారు?

జవాబు : గ్రామ సచివాలయాలను తనిఖీ చేస్తాం. ఉద్యోగులు అందుబాటులో లేకుంటే చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా తనిఖీల సమయంలో సిబ్బందిపై ఆరోపణలు వస్తే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : గ్రామాలలో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయా?

జవాబు : పల్లె పండగ వారోత్సవాలలో రూ.3.90కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయిస్తాం.

ప్రశ్న : గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనుల కోసం కూలీలు ఎదురు చూస్తున్నారు?

జవాబు : గ్రామ సభలు జరుగుతున్నాయి. పనులు గుర్తించి వెంటనే రోజువారీ కూలీలకు పనులు కల్పిస్తాం.

ప్రశ్న : గ్రామాలలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది?

జవాబు : పంచాయతీ కార్యదర్శులకు అప్రమత్తం చేసి గ్రామాలలో నిరంతరం పారిశుధ్య పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పింఛన్లను ప్రతి నెలా నూరు శాతం పంపిణీ చేస్తున్నారా?

జవాబు : ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్‌ల పంపిణీని వేగవంతంగా పూర్తి చేస్తున్నాం. మొదటి రోజే 97శాతం పంపిణీ చేపట్టేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ఎక్కడైనా వలస వెళ్లిన వారు ఉంటే రెండో రోజు వారికి అందిస్తున్నాం.



అగ్నిప్రమాదంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింథైట్ ఫ్యాక్టరీలో తనిఖీలు

మేదరమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింథైట్ ఫ్యాక్టరీలోని అన్ని విభాగాలను అధికారులు పరిశీలించారు. మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా సింథైట్ ఫ్యాక్టరీలో పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాధవనాయుడు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, డీఈ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ హుస్సేన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ గాయత్రిదేవి, డీఐసీ ఐపీవో ఉమాశంకర్ తదితర అధికారులు వివిధ విభాగాలను పరిశీలించారు. ఫ్యాక్టరీకిఇ సంబంధించిన అన్ని అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు సంభవించే క్రమంలో అత్యవసర సమయాలల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలు, చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. హెచ్‌ఆర్ అబ్దుల్ సలాం, మేనేజర్ జయరామన్, ఇతర అధికారులు వారి విభాగాలను వివరించారు.

ప్రతిభ చాటిన వలపర్ల విద్యార్థులు

హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి బహుమతి



వలపర్ల విద్యార్థులు లారెన్స్, కీర్తి

మార్టూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్-14 హ్యాండ్ బాల్ పోటీలలో మండలంలోని వలపర్ల హైస్కూల్‌లో 9వతరగతి చదువుతున్న విద్యార్థులు ఎం.లారెన్స్, ఎం.కీర్తి మూడవ బహుమతిని సాధించారు. 68వ రాష్ట్ర అండర్ 14, హ్యాండ్ బాల్ క్రీడల పోటీలు గుంటూరు జిల్లా తెనాలి డీఎస్ఏ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున వలపర్ల హైస్కూల్‌కు చెందిన ఈ విద్యార్థులు పోటీలలో పాల్గొనగా వారికి రాష్ట్ర స్థాయిలో 3వ బహుమతి లభించింది. ఈ మేరకు మంగళవారం జడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కే వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు టీ రవిదేవరాజు, విద్యా కమిటీ చైర్మన్ కే రమేష్ బాబు అభినందించారు.

మా బతుకులకు పండుగ లేదు

» నాలుగు నెలలుగా అందని జీతాలు
» పూటగడవక అవస్థలు

ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల ఆకలి కేకలు

చీరాలటౌన్, అక్టోబరు 29 : రోజంతా హాస్పిటల్‌లో రోగులకు సేవలు.. పరిశుభ్రంగా లేకపోతే అధికారులు, ప్రజల నుంచి మాటలు.. రాత్రయితే ఇంటికి చేరాక ఆకలి కేకలు. ఇది చీరాల ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల బతుకులు. దేశమంతా దసరా, దీపావళి పండుగలతో నూతన వస్త్రాలు, తిను బండరాలతో ఆనందంగా ఉంటే పాపం వీరు మాత్రం కుండలో మెతుకులు లెక్కబెట్టుకుని సర్దుకుపోతూ బతుకు జీవుడా అంటూ రోజులు వెళ్లదీస్తున్నారు.



చీరాల ఏరియా హాస్పిటల్

చీరాల ఏరియా పాత వైద్యశాలలో సుమారు 25 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. కాలంతో పాటు మారుతున్న పరిస్థితుల కారణంగా హాస్పిటల్ వంద పడకల హాస్పిటల్‌గా మారి అభివృద్ధితో పాటు నిత్యం ఓపీలు క్రమేపీ పెరుగుతు బిజీ బిజీగా కనిపిస్తోంది. 30 పడకల నుంచి 100 పడకల హాస్పిటల్‌గా రూపు దాల్చినా కూడా ఆ కొద్ది మందితోనే శానిటేషన్ పనులు చేయిస్తున్నారు. దీంతో సుమారు 11 ఎకరాల స్థలంలో 100 పడకల హాస్పిటల్‌కు సిబ్బంది కొరత తీవ్రంగా ఏర్పడింది. వారికి పనిభారం పెరిగింది. అయినా చాలీచాలని జీతంతో పని చేస్తున్నా నాలుగైదు నెలలు పాటు జీతాలు అందకపోవడంతో ఏపూటకాపూట ముద్ద దిగేది ఎలా అంటూ వేదన చెందుతున్నారు. ముష్టి మాదిరిగా ఐదు నెలలకు ఈనెల మధ్యలో ఒక్క నెల జీతం పడింది. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఇళ్లల్లో మెడికల్, వాయిదాలు, అద్దెలు, ఇంటి నిత్యావసరాలు వంటి సమస్యలతో సతమత మవుతున్నారు. అధికారులు వారిపట్ల కనికరం చూపాలని వేడుకుంటున్నారు.

జీతాలు ఆలస్యం వాస్తవమే



హాస్పిటల్‌లో సిబ్బంది కొరత ఉంది. అలాగే ఉన్నవారికి జీతాల సమస్యలు ఉన్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాం. వెంటనే వారికి న్యాయం జరిగేలా చూస్తాం.

- డా.సుభాషిణి, సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్

రీసర్వేలో సమస్యలను పరిష్కరిస్తాం

అద్దంకి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లక్ష్యం అని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు అన్నారు. అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు హాజరై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తమ భూమి వేరే వ్యక్తి పేరు తో ఆన్‌లైన్ లో ఉందని రైతు అర్జీ అందజేయగా వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. సర్వే కోసం మరో రైతు అర్జీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీచరణ్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శంకర్ పాల్గొన్నారు.



అర్జీని తీసుకుంటున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు : రీసర్వేలో తలెత్తిన అన్ని సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ పీ సింగారావు తెలిపారు. మండలంలోని కోటపాడు గ్రామంలో రీసర్వే సమస్యల పరిష్కారం కోసం మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఎల్‌పీఎంతో తలెత్తిన సమస్యలను సబ్ డివిజన్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. విస్తీర్ణంలో వ్యత్యాసాలు, మ్యూటేషన్ వంటి సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు దరఖాస్తులను అందచేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ బి.సురేష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో పాటు నాయకులు గడ్డం నాగేశ్వరరావు, తాటి సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గత రీ సర్వేలో తలెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం సోమవరప్పాడులో భూ సమస్యలను రైతులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఉండాల్సిన విస్తీర్ణం కన్నా తక్కువ భూమితో పాసు పుస్తకాలను ఇచ్చారని రైతులు చెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, డీటీ రవికాంత్, సర్వేయర్ మహేష్‌బాబు, గ్రామ సర్వేయర్‌లు ఇమ్మానియేలు పాల్గన్నారు.

చినగంజాం : భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలను నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సుజాత అన్నారు. మండలంలోని కడవకుదురు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో 82 మంది రైతుల నుంచి అర్జీలను స్వీకరించినట్లు డీటీ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ నాగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు పి.నాగరాజు, ఆమంచి సత్యానారాయణ, గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏలు, మాజీ ఉపసర్పంచ్ వీరరాఘవులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని నాగండ్ల గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. ఈ గ్రామసభలో భూ రీసర్వేకి 70 అర్జీలు అందినట్లు తహసీల్దారు వెంకటరత్నం తెలిపారు.

కార్యక్రమంలో గ్రామస్థులు, రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్ పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిద్దాం

ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట(చీరాల), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సేవలో ముందుందాం. ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్లా వంశీకృష్ణ, మువ్వల వెంకట రమణారావు తదితరులు ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య కొంతసేపు రాజకీయ చర్చ జరిగింది. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, చంద్ర పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, నాయకులు

మునిసిపల్ కమిషనర్‌కు పీఎం స్వానిధి అవార్డ్

చీరాలటౌన్, అక్టోబరు 29 : చీరాల మునిసిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ పీఎం స్వానిధి పథకానికి సంబంధించి రాష్ట్రస్థాయి అవార్డు తీసుకున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మెప్మా విభాగం ద్వారా సుమారు 3846 మంది వీధి విక్రయిదారులు, చిరు వ్యాపారులకు రుణాలు అందించిన నేపథ్యంలో మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో మెప్మా ఎండీ తేజ్‌భరత్ కూడా ప్రత్యేకంగా అభినందించారు.



మంత్రి నారాయణ నుంచి అవార్డ్‌ను అందుకుంటున్న మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్

ఆత్మీయ సదస్సును విజయవంతం చేయండి

మార్టూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో వచ్చే నెల 11వ తేదీన జరిగే మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని మంగళవారం కోనంకి గ్రామంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, సుబ్బారావు, నాని, భాగ్యారావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డయేరియాకు అడ్డుకట్ట

అద్దంకిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే డయోరియాను అరికట్టవచ్చని కాకానిపాలెం యూపీహెచ్‌సీ డాక్టర్ ఎం.హేమమాధురి అన్నారు. మంగళవారం అద్దంకిలోని రాయల్ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. కాలేజీ విద్యార్థులకు డయోరియా, టైఫాయిడ్, మలేరియా వ్యాధులకు అవగాహన కల్పించారు. సీజనల్‌గా వ్యాధులు గురించి తగు జాగ్రత్తలు పాటించాలని, జ్వరం వచ్చేకంటే ముందే మనం దోమల నిర్మూలన చేపట్టాలని, దొమతెరలు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హేమమాధురి



మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

బల్లికురవ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో కుసుమకుమారి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30వ తేదీన పింఛన్ నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసి, 1వ తేదీన పంపిణీ చేయాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టి, వ్యాధులు రాకుండా చూడాలన్నారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవని కుసుమకుమారి హెచ్చరించారు.

పాఠశాలకు బీరువా అందజేత

అద్దంకిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు బీరువాను అందజేశారు. మండలంలోని చక్రాయపాలెం జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలకు రోటేరియన్, విశ్రాంత ప్రొఫెసర్ జాగర్లమూడి శివకుమారి సౌజన్యంతో ఐరన్ బీరువాను బహూకరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. దాత శివకుమారిని రోటరీ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంట బీమా ప్రీమియం చెల్లించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో

అద్దంకిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రబీలో పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకానికి రైతులు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగకు రూ.84, మొక్కజొన్నకు రూ.105, వరికి రూ.126, మినుము, వేరుశనగకు రూ.60, పెసరకు రూ.36 చొప్పున ఎకరాకు చెల్లించాలన్నారు. డీఏపీ, యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, నటరాజ్ పాల్గొన్నారు.

బల్లికురవ : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలంటే వెంటనే ప్రీమియం నగదును చెల్లించాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెం గ్రా మాలలో పొలంపిలుస్తోంది నిర్వహించారు. డిసెంబర్ 15లోపు పంటల బీమాను చెల్లించాలని రైతులకు సూచించారు. అనంతరం వరి పంటను ఏవో పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్, వీఏఏ ప్రసన్న, చెన్నకేశవరెడ్డి, రైతులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంగులూరు : పంటసాగులో రైతులు ఎరువులు, పురుగు మందుల వాడకం తగిన మోతాదుకు మించి వినియోగించరాదని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. ఆరికట్లవారిపాలెం, కశ్యాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగు చేసిన వరి, పొగాకు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు


మార్టూరు : రైతులకు 25 శాతం రాయితీతో శనగ విత్తనాలను అందిస్తామని సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని ద్రోణాదుల, చిమ్మిరిబండ గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ మాట్లాడుతూ మినుము నష్టంపై ఎన్యూమరేషను పూర్తయిందన్నారు. 530 మంది రైతులకు చెందిన 1100 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అంచనా తయారు చేసి ప్రభుత్వానికి పంపించినట్లుత తెలిపారు. కార్యక్రమంలో రైతుల, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

మార్టూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదు.. అంటించుకునే వ్యాధి అని, దీనిపై ప్రతి ఒక్కరికీ పూర్తి అవగాహన ఉండాలని మార్టూరు స్టేషన్ ఏఎస్ఐ ఎస్కే బాషా అన్నారు. మంగళవారం మార్టూరు పోలీస్ స్టేషన్‌లో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా కరపత్రాలను ప్రదర్శించారు. ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అందే ఆరోగ్య సేవలను వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, అంజనేయులు, మార్టూరు ఔట్ రిచ్ వర్కర్లు దుర్గ, రూతు, మోహన్ను, సచివాలయాల మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



దొరికావా తండ్రీ!



'నాయనా ఎక్కడికిపోయావ్.. నిన్ను తీసుకెళ్లడానికి వాళ్లకు చేతులెలా వచ్చాయిరా. దక్కుతావో లేదనని ఈ కన్నపేగు తల్లడిల్లి పోయిందిరా! మా వేదనను విన్న ఆ దేవుడే పోలీసుల రూపంలో వచ్చాడు. మా బిడ్డను మాకు దక్కేలా చేశాడు' అంటూ తల్లి దండ్రుల ఆనందంతో ఉబ్బితబ్బిబ్బ య్యారు. కావలిలో సోమవారం అపహరణకు గురైన 15నెలల చిన్నారిని పోలీసులు ఆధునిక సాంకేతికత ఆధారంగా గుర్తించారు. నిందితురాలిని పట్టుకోవడమేగాక మంగళవారం రాత్రి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

8



ఇష్టంగా తినేలా..!

- మధ్యాహ్న భోజనంపై అధికారుల కసరత్తు
- మెనూలో మార్పులపై అభిప్రాయాల సేకరణ

విద్యార్థులు బడి మానకుండా, ఎవరూ ఆకలితో బాధ పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ పథకంలో కొంతమంది మాత్రమే భోజనం చేస్తుండగా మరి కొంతమంది అయిష్టంతో వదిలేస్తున్నారు. ఇంకొంతమంది ఇళ్ల నుంచే తెచ్చుకుని తింటున్నారు. బియ్యం బాగా లేకపోవడం, కూరల్లో రుచి లోపించడం, మెనూలో అందించే పదార్థాలపై పిల్లలకు ఆసక్తి లేకపోవడం తదితర అంశాలే ఇందుకు కారణమనే అభిప్రాయాలు కొంతకాలంగా వ్యక్తమవుతున్నాయి. బడి భోజనంలో లోపాలు సరిదిద్దాలని గత వైసీపీ హయాంలో ఎన్నో సమీక్షల్లో ప్రస్తావించినా, నాటి పాలకులు పెడచెవిన పెట్టారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది.

8

మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు

- జిల్లాలో ప్రక్రియ ప్రారంభం
- సీనియారిటీ జాబితా విడుదల
- 6న హెచ్ఎంలకు, 8న ఎస్ఏలకు..

నెల్లూరు (విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ యాజమాన్యాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. టీచర్ల నియామకాలు, పదోన్నతులు గతంలో మునిసిపల్ అధికారులే నిర్వహిస్తుండగా ప్రస్తుతం వీరి సర్వీసులన్నీ పాఠశాల విద్య పరిధిలోకి తీసుకురావడంతో విద్యాశాఖ సమక్షంలో పదోన్నతుల బదిలీలు జరగనున్నాయి. ప్రభుత్వ, జడ్పీ యాజమాన్య టీచర్లతో సమానంగా మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా, ఎస్జీటీలుగా పనిచేస్తున్న టీచర్లకు ఎస్ఏలుగా పదోన్నతులు కల్పిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ (సోమవారం) సీనియారిటీ జాబితా విడుదల చేయగా, నవంబరు 1వతేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 4వ తేదీన తుది సీనియారిటీ జాబితా ప్రకటిస్తారు. హెచ్ఎంల పదోన్నతులు మాత్రం 6వ తేదీన ఆర్జేడీ నిర్వహిస్తుండగా ఎస్ఏల పదోన్నతుల మాత్రం డీఈఓ పర్యవేక్షణలో 8వతేదీ జరగనున్నాయి.

630 మంది టీచర్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరులో 68, గూడూరులో 18, కావలిలో 21 కలిపి 107 మున్సిపల్ పాఠశాలలు ఉండగా 630 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకటించిన మెగా డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో మునిసిపల్ పాఠశాలల చెందిన టీచర్ పోస్టుల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల నుంచి దాదాపు 53 వేకెన్సీలను చేర్చారు. డీఎస్సీలో చేర్చిన వాటిలో 2025 మే నెలాఖరు వరకు ఏర్పడే వ్యాకెన్సీలను కూడా చేర్చడంతో ప్రస్తుతం మిగిలిన ఖాళీలకు మాత్రమే పదోన్నతులు వచ్చే అవకాశం ఉంది. దీనిపై విద్యాశాఖ మరో రెండురోజుల్లో స్పష్టత ఇవ్వనుంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్జీటీల నుంచి తగిన అర్హతలు కలిగిన వారికి ఆయా సబ్జెక్టులలో అందుబాటుల్లో ఉన్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నారు. అయితే మొత్తం మీద పద్నోతుల సంఖ్య తక్కువగానే ఉండడంతో దీనిపై కసరత్తు ప్రారంభించామని మరో రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని అధికారులు తెలిపారు.



సిలికా గనులు పరిశీలిస్తున్న అధికారుల ప్రత్యేక బృందం

గనులు మింగిన ఘనులెందరు!?

- సిలికా, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై తనిఖీలు
- జిల్లాకు చేరుకున్న నాలుగు ప్రత్యేక బృందాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సిలికా, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై విచారణకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. నెల్లూరు, కడప, ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు చెందిన మైనింగ్ శాఖ అధికారుల సారథ్యంలోని నాలుగు ప్రత్యేక బృందాలు జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా మైనింగ్ డీడీ చంద్రశేఖర్, గూడూరు మైనింగ్ ఏడీ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మంగళవారం తనిఖీలను ప్రారంభించాయి. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ గనుల్లో తవ్వకాలను నిలిపేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమ మైనింగ్ దోపిడీని నిగ్గు తేల్చిన తర్వాతే గనులకు అనుమతులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందాలు జిల్లాకు రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో దాదాపు 180 క్వార్ట్జ్ లీజులు ఉండగా 30 మంది, సిలికా లీజులు 80 ఉండగా వాటిలో 16 మంది వైసీపీ ప్రభుత్వంలో భారీగా అక్రమ మైనింగ్ చేశారు. వీరందరిపై ఇప్పటికే మైనింగ్ శాఖ భారీగా జరిమానా విధించింది. అయితే, కొంతమంది కోర్టుకు వెళ్లడంతో అలాంటి వారికి ఇకపై లీజు ఇవ్వకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా లీజులను ఈ బృందాలు తనిఖీలు చేసి అనుమతులకు మించి తవ్వకాలు జరిపి ఉంటే ఏ మేరకు జరిమానా వేయవచ్చు అన్నదానిపై నివేదికలను రాష్ట్ర ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. తదనంతరమే లీజులకు అనుమతులు ఇవ్వనున్నారు.

నిబంధనలపైనే దృష్టి

జిల్లాలోని గనులను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందాలు ప్రధానంగా నిబంధనలపై దృష్టి సారిస్తున్నాయి. ప్రతి మైనింగ్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు జియో ట్రాకింగ్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. వీటితోపాటు లీజు స్థలం హద్దులను నిర్ణయించి మార్కింగ్ చేయిస్తున్నారు. ఇలా ప్రతి మైనింగ్ లీజుదారుడు ఇకపై అక్రమ మైనింగ్ చేసేందుకు వీలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకొంటున్నారు

నిబంధనలు ఏవయ్యా..
మా నాయకుడితో మాట్లాడుకోండి!

- ఓ ఇన్‌స్పెక్టర్‌కు వ్యాపారి దిమ్మతిరిగే సమాధానం
- ఇష్టానుసారం వెలుస్తున్న బాణసంచా దుకాణాలు

ఏమండీ షాపు ఏర్పాటుకు మీకు స్థలం అక్కడ కేటాయించాం కదా!. మరి ఇక్కడ పెట్టారేంటి!?

- బాణసంచా దుకాణదారుడితో ఓ పోలీసు

ఎక్కడ పెడితే ఏముందిలే సార్. మీ కండీషన్స్ అన్నీ ఫాలో అవుతున్నాము. ఫైర్ మిషన్లు, ఇసుక, వాటర్ ఇలా అన్నీ షాపు దగ్గర ఉన్నాయి. ఏమైనా ఉంటే మా నాయ కులతో మాట్లాడు కోండి.

- పోలీసుకు దుకాణదారుడి సమాధానం.



బాణసంచా దుకాణదారులను ప్రశ్నిస్తున్న ఇన్‌స్పెక్టర్

ఇదండీ వరస. నెల్లూరులో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఇష్టానుసారంగా జనం రద్దీ ఎక్కడ ఉంటే అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసేశారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో మంగళవారం కథనం ప్రచురితమైనా ఇటు అధికారులు, అటు వ్యాపార వర్గాల్లో చలనం లేదు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని చిల్డ్రన్స్‌పార్కు పక్కనే కార్పొరేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాన్ని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణం ఎందుకు ఏర్పాటు చేశావని వ్యాపారుడిని నిలదీశారు. దీంతో ఆయన 'ఏమైనా ఉంటే మా నాయకులతో మాట్లాడుకోండి సార్.' అని సమాధానం ఇవ్వడంతో సీఐ ఖంగుతిన్నాడు. ఈ విషయ మై ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా ఈ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

కాసులే కాదు.. టపాసులూ గిఫ్ట్!

కావలి (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం వ్యాపారులు బంపర్ ఆఫర్ ప్రకటించారు. అనుమతుల కోసం కాసులు ఇవ్వడమేకాదు.. వారికి ప్రత్యేక బాణసంచా గిఫ్ట్ ప్యాక్‌లు ఇస్తున్నారు. అదేస్థాయిలో అధికారులు కూడా వ్యాపారుల ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఈ ఖర్చులన్నీ తడిసి మోపెడు కావడంతో వ్యాపారులు ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో 28 సంచార దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. వాటిలో 24 రెన్యువల్ కాగా 4 దుకాణాలు కొత్తగా లైసెన్స్ పొందారు. దుకాణాల



లైసెన్స్ రెన్యువల్ చేసుకుని ఏర్పాటు చేసుకోవాలంటే నిర్వాహకులు ఫైర్, పోలీస్, రెవెన్యూ, కమర్షియల్ టాక్స్, మున్సిపాలిటీ, కార్మిక శాఖల అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. దుకాణదారులంతా సిండికేట్ అయి ఒకరి ద్వారా అన్ని శాఖల అనుమతులు పొందేందుకు ఎవరి వాటా వారికి చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కమర్షియల్ టాక్స్, మున్సిపాలిటీలకు అధికారికంగా చలానాలు చెల్లిస్తుండటంతో వారికి పెద్దగా మామూళ్లు ఇవ్వకుండా గిఫ్ట్‌ప్యాక్‌లతో సరిపెట్టుకుంటారని వ్యాపారులు చర్చించుకుంటున్నారు. అయితే ఫైర్, పోలీస్, రెవెన్యూ శాఖలకు కలిపి ఒక్కో దుకాణానికి రూ.40వేలు పైచిలుకు వసూలు చేసినట్లు సమాచారం. దాని ప్రకారం మొత్తం 28 దుకాణాలు కేవలం మూడు రోజుల అనుమతులకు ఆ మూడు శాఖలకు సుమారు రూ.11 లక్షలు వసూలు చేసి చెల్లించినట్లు తెలుస్తోంది.



అధర్మ నిర్మూలనే నరక చతుర్దశి

- రేపు దీపావళి

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధర్మాన్ని పాటించని వారందరూ నరకాసురులే. అటువంటి వారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించడమే నరక చతుర్దశి ఉద్దేశం. ద్వాపర యుగంలో నరకాసురుని వేధింపులు తాళలేని జీవరాసులన్నీ శ్రీకృష్ణుడికి విన్నవించుకుంటాయి. దీంతో నరకాసురుడిపైకి యుద్ధానికి శ్రీకృష్ణుడు, సత్యభామ వెళతారు. యుద్ధంలో శ్రీకృష్ణుడు మూర్ఛచెందడంతో ఆగ్రహావేశంతో సత్యభామ నరకాసురుడిని

- మిగతా 8లో..



నెల్లూరులో మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు





వెలుగు దివ్వెలు

వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు

సంప్రదాయం ఉట్టిపడేలా ఫ్యాన్సీ దీపాలు

దీపావళి.. చెడుపై విజయానికి చిహ్నం. ప్రతి ఇంటా వెలుగులు నింపే ఈ పండుగను చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. దీపాలతో గృహాలను అలంకరించుకొని ఆనందానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒకప్పుడు మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగించేవారు. అయితే కాలగమనంలో మట్టిప్రమిదల స్థానంలో కొవ్వొత్తులు వెలిశాయి. రోజులు మారే కొద్దీ తిరిగి సంప్రదాయంగా మట్టితో తయారు చేసిన ప్రమిదలకు గిరాకీ పెరిగింది. వివిధ రకాల ఆకృతులలో మార్కెట్‌లో ఇవి



ఆత్మకూరులో వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు

లభ్యమవుతున్నాయి. వీటి ధరలు డజను రూ.50 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. సుమారు 20 రకాల మట్టి, ఫ్యాన్సీదీపాలు ఈ ఏడాది మార్కెట్‌లో అబ్బురపరుస్తున్నాయి. నెల్లూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో మట్టిప్రమిదల విక్రయాలు జోరందుకున్నాయి. వివిధ ఆకృతుల్లో ఉన్న ప్రమిదలను కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి కనపరుస్తున్నారు. ఆత్మకూరులో చిన్నసైజు ప్రమిదలు రూ.10 నుంచి పెద్దసైజు ప్రమిదలు రూ.200 వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక దుకాణాల్లో పలు రకాల ఫ్యాన్సీ దీపాలు మార్కెట్‌లోకి వచ్చాయి. వీటి ధర రూ.100 నుంచి 500 వరకు ఉన్నాయి. బ్యాటరీ సాయంతో వెలిగేవి.. నేరుగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగలవి అందుబాటులోకి వచ్చాయి. అయితే, వీటిని కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వివిధ ఆకృతుల్లో ఉన్న ప్రమిదలు, సంప్రదాయం ఉట్టిపడేలా ఫ్యాన్సీ దీపాలను మహిళలు ఆదరిస్తున్నారు.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)

కీలక శాఖలకు ఇన్‌చార్జులే దిక్కు

- రెగ్యులర్ అధికారుల నియామకంలో జాప్యం
- ఆయా శాఖలపై కొరవడుతున్న పర్యవేక్షణ
- క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు

నెల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీలక శాఖలు ఇంకా గాడిన పడలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా కొన్ని శాఖలకు రెగ్యులర్ అధికారులే కొలువుదీరలేదు. దీంతో ఆ శాఖలన్నీ ఇన్‌చార్జుల పాలనలో నడుస్తున్నాయి. ఇతర శాఖల అధికారులు ఈ శాఖ లకు ఇన్‌చార్జులుగా ఉండటంతో ఎక్కువ సమయం ఈ శాఖలకు కేటాయించలేకపోతున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కొరవడుతోంది. సమస్యల పరి ష్కారంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇన్ చార్జ్ అధికారులు చుట్టపుచూపుతా వచ్చి వెళుతుండ టంతో ఆయా కార్యాలయాల్లోని సిబ్బందిలో కూడా నిర్లక్ష్యం ఆవహించింది. వివిధ పనులపై వస్తున్న ప్రజలకు సమాధానం చెప్పేవారూ కరువవుతుండటం గమనార్హం.

● కీలకమైన సంక్షేమ శాఖలకు ఇన్‌చార్జ్ అధికా రులే దిక్కయ్యారు. కొన్ని శాఖలు చాలా కాలం నుంచి ఇన్‌చార్జ్‌ల పాలనలో సాగుతుండగా, మరికొన్ని ఇటీవల అక్కడ పనిచేస్తున్న అధికారుల పదవీ విరమణతో ఖాళీ అయ్యాయి. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, బీసీ సంక్షేమ శాఖ డీడీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వంటి మూడు ముఖ్యమైన శాఖలకు ఇతర శాఖల అధికారులు హెచ్‌వోడీలు వ్యవహరిస్తున్నారు. అలానే మరో ముఖ్యమైన శాఖ ఐటీడీఏ కూడా ఇన్‌చార్జ్ పాలనలో కునారిల్లుతోంది.

● ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ)లో జోనల్ మేనేజర్ పోస్టుతో సహా పలు డిప్యూటీ జోనల్ మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇది ఇబ్బందిగా మారింది. కీలకమైన ఇరిగేషన్ శాఖకు సంబంధించి జిల్లాలో మూడు ఎస్‌ఈ పోస్టులున్నాయి. అన్నింటికీ ఇన్‌చార్జ్ ఎస్‌ఈలే ఉన్నారు. రెగ్యులర్ ఇరిగేషన్, సోమశిల ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టులకు చాలా కాలం నుంచి ఇన్‌చార్జ్ ఎస్‌ఈలే దిక్కుగా ఉన్నారు. కాగా వికలాంగుల సంక్షే మ శాఖ ఏడీ పోస్టు కూడా కొన్ని నెలల నుంచి ఖాళీగా ఉంది.

● నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) వైస్ ఛైర్మన్ పోస్టు కూడా గడిచిన కొంత కాలం నుంచి ఖాళీగా ఉంది. నగరపాలక సంస్థ కమిషనర్ నుడాకు ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరిస్తున్నారు. రియల్ ఎస్టేట్ పుంజుకుంటున్న తరుణం, నుడా పరిధిలో వర్కులు జరగాల్సిన సమయంలో వీసీ పోస్టు ఖాళీగా ఉండడం ఇబ్బంది గా మారింది. ఇక జడ్పీ సీఈవో పోస్టు కూడా ప్రస్తుతం ఇన్ చార్జి పాలనలో నడుస్తోంది. రెగ్యులర్ సీఈవోను ప్రభుత్వం నియమించినా ఆయన గత నెలలో సెలవు పెట్టి వెళ్లిపోయా రు. నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకూ తిరిగి రాలేదు.

అధర్మ నిర్మూలనే నరక చతుర్దశి

(7వ పేజీ తరువాయి)

సంహరిస్తుంది. నరకుడి సంహారం అయిన పక్కరోజును సమస్త జీవరాశులు దీపావళిగా పండుగ చేసుకుని హర్షం వ్యక్తం చేస్తాయి. నరక చతుర్దశి రోజు సాయంత్రం ప్రతి ఇంటా దీపాలు వెలిగిస్తారు. టపాకాయలు పేలుస్తారు. దీపావళి సందర్భంగా కేదారేశ్వర వ్రతాలు, ధనలక్ష్మీ పూజలు చేస్తారు. అయితే ఈ ఏడాది టపాకాయల ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది కన్నా 15 నుంచి 25 శాతం పెరిగాయి.

భక్తిశ్రద్ధలతో ధన త్రయోదశి

మార్వాడీలు, జైనులు జరుపుకునే దీపావళి 5 రోజులు పండుగల్లో మొదటిరోజు ధన త్రయోదశిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జైన మందిరాల్లో ప్రత్యేక పూజలు, బంగారు దుకాణాల్లో లక్ష్మీ పూజ జరిగాయి.

రేపే దీపావళి అమావాస్య

తిథి ద్వయం కారణంగా ఈ ఏడాది దీపావళి అమావాస్య ఎప్పుడు జరుపుకోవాలనే సంశయం అందరిలో ఉంది. అయితే 31వ తేదీ గురువారమే దీపావళి జరుపుకోవాలని పండితులు తెలియజేశారు. అమావాస్య 31వతేదీ మధ్యాహ్నం 2.47గంటలకు మొదలై నవంబరు 1 సాయంత్రం 4.30గంటలకు ముగుస్తుంది. అందువల్ల ప్రజలు దీపావళి అమావాస్యను 31వతేదీ సాయంత్రం జరుపుకోవాలని సూచించారు. పితృకార్యాలు చేసేవారు నవంబరు 1వతేదీన దీపావళి జరుపుకోవాలని వివరించారు.

రంగడి ఆలయంలో నేడు ఆస్థానం

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం దీపావళి ఆస్థానం జరుగుతుందని ఆలయ ఈవో ఏ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5.30గంటలకు రంగనాథస్వామికి గోపురోత్సవం అనంతరం నరకాసురవధ వేడుక జరుగుతాయని తెలిపారు. గురువారం దీపావళి పర్వదినం సందర్భంగా ఉదయం 8.30గంటకు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజన సేవలు జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 4.30గంటలకు పేట ఉత్సవం జరుగుతుందన్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై కలెక్టర్ సీరియస్

కలువాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపుపై మంగళవారం జిల్లా కలెక్టర్ ఆనంద్ సీరియస్ అయ్యారు. మండలంలోని పెన్నబద్వేలు సమీ పంలోని పెన్నానది ఒడ్డున ఉన్న భూముల నుంచి కొందరు అక్రమార్కులు భారీగా ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లకు లోడ్ చేసి బయటకు తరలించి, రాత్రికిరాత్రే అక్రమ రవాణా చేస్తున్న విషయమై సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా కలెక్టర్ తహసీల్దారు శ్యామ్‌సుందరరాజుకు ఫోన్ చేసి ఇసుకను ట్రాక్టర్లకు లోడ్‌చేసే యంత్రాలను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిం చినట్లు సమా చారం. ఈ విషయమై తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని పెన్నానది పరివా హక ప్రాంతంలో ఎక్కడైనా యంత్రాలతో ఇసుక లోడ్ చేసి అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామాక్షితాయి ఆలయ హుండీల లెక్కింపు

● 56 రోజులకు రాబడి రూ.28,18,925

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం లెక్కింపు చేపట్టారు. ఆలయంలోని ప్రధాన హుండీల ద్వారా గత నెల 4వ తేదీ నుంచి ఇప్పటి వరకు 56రోజులకు రూ.28,18,925 ఆదాయం చేకూరినట్టు ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అలాగే అన్నదానం హుండీల ద్వారా రూ.1,58,863 భక్తులు సమర్పించారన్నారు. అదేవిధంగా 88.870 గ్రాముల బంగారు వస్తువులు, 128 గ్రాముల వెండి వస్తువులు, 11 యూఎస్‌ఏ డాలర్లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణచైతన్య, ఏపీజీబీ అధికారులు, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నాన్ జుడీషియల్ స్టాంపుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిన రూ.1.20 కోట్ల విలువైన స్టాంపు కాగితాలను జిల్లాలోని అన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మంగళవారం పంపిణీ చేశారు. జిల్లాకు రూ. 100, రూ.50 స్టాంపులు ప్రభుత్వం నుంచి వచ్చాయి. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాల వారీగా పంపిణీ చేశారు. నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 16 వేలు, కావలికి 8 వేలు, కందుకూరుకు 5వేలు, కోవూరుకు 4 వేలు, ముత్తు కూరుకు 4 వేలు, పొదలకూరుకు 4 వేలు, రాపూరుకు 2 వేలు, ఉదయగిరికి రెండు వేలు వంతున స్టాంపులు పంపిణీ చేశారు.

'సోమశిల'లో 66.480 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి 19,923 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 66.480 టీఎంసీలు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● 'కండలేరు' నీటిమట్టం

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 43 టీఎంసీల నీరు ఉందని ఏఈ కట్ట తిరుమలయ్య తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి డ్యాంకు ఎటువంటి ప్రవాహం లేదని, అవుట్‌ఫ్లో 1,435 క్యూసెక్కులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

నెల్లూరు టీజీపీ స్పెషల్ కలెక్టర్‌గా వెంకటరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.వెంకటరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీపీ ఆత్మకూరు యూనిట్ ఎస్‌డీసీగా వీకే శీనా నాయక్‌ను, రాపూరు టీజీపీ ఎస్‌డీసీగా ఎం.కిరణ్‌కుమార్‌ను నిమిమించారు. కాగా నుడా వీసీగా నెల్లూరులో పనిచేసి పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న బాపిరెడ్డి శ్రీకాళహస్తి ఈఓగా నియమితులయ్యారు.

సైన్స్ ఫెయిర్‌లతో సృజనాత్మకత

మంత్రి డాక్టర్ స్వామి ● ముగిసిన జోనల్-3 గురుకులాల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

కొండపి, అక్టోబరు 29 : సైన్స్ ఫెయిర్‌లతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. జోన్-3 గురుకులాల జోనల్ (ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, పాక్షిక నెల్లూరు) స్థాయి సైన్స్‌ఫెయిర్ కొండపిలోని గురుకులంలో సోమ, మంగళవారాల్లో జరిగింది. ముగింపు సభలో మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా గురుకులాలు, సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను తీర్చిదిద్దుతామ న్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సంజీవరావు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల గురుకులాల కోఆర్డినేటర్లు డి.జయ, కె.పద్మజ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజేతలు వీరే..

సైన్స్‌లో.. జూనియర్స్ విభాగంలో బోగోలుకు చెందిన డి.వర్షిత (మల్టీ పర్పస్ అగ్రికల్చర్ టూల్స్ అండ్ ఆటోమేటిక్ రైన్ రూఫ్) ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది.

మ్యాథ్స్‌లో.. సీనియర్స్‌లో కొత్తకోడూరుకు చెందిన ఎ.డిస్నీసం ధ్య ప్రాజెక్టు (అప్లికేషన్స్ ఆఫ్ ట్రిగణమెట్రీ) ప్రథమ, బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వై.పవిత్ర ప్రదర్శన (సర్కిల్ థీరమ్స్ ఎక్స్‌ప్లైన్డ్ పై వాల్యూ) ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. జూనియర్స్ విభాగంలో కండలేరుకు చెందిన జి.చైత్రకృష్ణ ప్రాజెక్టు (ఫ్రాక్షన్స్ డిస్క్) ప్రథమ సాధించింది.

ఐసీటీలో.. సీనియర్స్‌లో సంగంకు చెందిన పి.ప్రణవిసాయి ప్రాజెక్టు (మేజర్ అండ్ సోలార్ ఫెన్సింగ్ సెక్యూరిటీ సిస్టం) ప్రథమ, జూనియర్స్ విభాగంలో ముత్తుకూరుకు చెందిన వి.సాత్విక ప్రదర్శన (డ్రోన్) ద్వితీయ స్థానాల్లో నిలిచింది.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో.. జూనియర్స్ విభాగంలో అదురుపల్లికి చెందిన సిహెచ్. నిత్య ప్రదర్శన (వర్క్ ఆఫ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్)కు ద్వితీయ బహుమతి దక్కింది.



ఇష్టంగా తినేలా..!

- మధ్యాహ్న భోజనంపై అధికారుల కసరత్తు
- మెనూలో మార్పులపై అభిప్రాయాల సేకరణ
- వచ్చే నెల మొదటివారంలో అధికారుల సమీక్ష
- ఆ తర్వాతే కొత్త మెనూ అమలులోకి..

నెల్లూరు(విద్య), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం ప్రహసనంగా సాగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్పందించి పునరుద్ధరణకు నడుంబిగించింది. డొక్కా సీతమ్మ మధ్యా హ్న బడి భోజన పథకంగా పేరు మార్పుచేసింది. దీంతోపాటు పిల్లలు ఇష్టంగా తినాలంటే ఏం చేయాలి.. ఎలాంటి మార్పులు అవసరం? అనే విషయాలపై దృష్టి సారించింది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఇటీవల అన్ని జిల్లాల కలెక్టర్‌ల అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడి డివిజన్ల వారీగా మూడు బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మెనూ మార్పులపై అభిప్రాయాలను సేకరించారు. దీనిపై నవంబర్ మొదటి వారంలో రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించి అదే నెల నుంచి అమలు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

● **భోజనానికి 1,64,480 మంది విద్యార్థులు**

జిల్లాలోని 2013 ప్రాథమిక పాఠశాలల్లో 80,970 మంది, 259 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 51,231 మంది, 295 ఉన్నత పాఠశాలల్లో 32,279 మంది కలిపి మొత్తం 2567 పాఠశాలల్లో 1,64,480 మంది విద్యార్థులు బడి భోజనం చేస్తు న్నారు. రూ.కోట్లు వెచ్చించి మధ్యాహ్నభోజనం అందిస్తున్నా విద్యార్థులు ఆసక్తి కనబరచక పోవడానికి గల కారణాలను అన్వేషిస్తూ సమూల మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇటీవల జరిగిన అధికారుల సమీక్షలో విద్యార్థులకు సాంబార్, బాత్‌ను రెండూ కలిపి కాకుండా వేర్వేరుగా వడ్డించాలని, వారంలో ఐదు రోజులు ఇస్తున్న గుడ్డును మూడు రోజులు వేపుడు, కూరరూపంలో ఇవ్వాలని, పచ్చళ్లలో గోంగూర కూడా చేర్చాలని, రాగి జావలో సుగంధ ద్రవ్యాలు కలపాలని, వారంలో అన్ని రోజులూ రాగి జావ ఇవ్వకుండా కేక్, లడ్డూ, ఎండు ఫలాలతో కలిపి ఇవ్వాలని పలువురు అధికారులు ప్రతిపాదించారు. అలాగే ప్రస్తుతం ఇస్తున్న బియ్యాన్ని కాకుండా సన్నబియ్యం సరఫరా చేయాలని, ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల పిల్లలకు ఒక్కొక్కరికి వంద గ్రాములు, పై తరగతులకు 150 గ్రాముల బియ్యం కేటాయిస్తున్నారు. అయితే వీటి పరిమాణం పెంచాలని, వంట గ్యాస్ రాయితీ ధరకు అందించాలని కూడా తెలిపారు. అలాగే పెరిగే నిత్యావసరాలకు అనుగుణంగా వంట తయారీ నిర్వాహకులకు ధరలు చెల్లించాలని, భోజనానికి అనువుగా ఉండే పాత్రలు సమకూర్చడం, వంటగదులు లేనిచోట నిర్మాణాలు చేపట్టడం, ప్రభుత్వం ద్వారానే కందిపప్పు సరఫరా చేయాలని కూడా నిర్ణయించారు. అలాగే ఆర్వో ప్లాంట్స్ నుంచి నీటిని సరఫరా చేయడంతోపాటు వారానికి ఒక రోజు మెనూలో ఏదైనా పండు, మజ్జిగ కూడా చేర్చాలని సూచించారు. వీటన్నింటిపై అభిప్రాయ సేకరణలు పూర్తి చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు అందచేశారు.

మెనూ మార్పు ఇలా...

వారం	ప్రస్తుతం	ప్రతిపాదన
సోమ	హాట్‌పొంగల్ విత్ బాయిల్డ్ ఎగ్ చింతపండు పులిహోర, దొండకాయ చట్నీ ఉడికించిన గుడ్డు, రాగిజావ	వైట్‌రైస్, ఎగ్ కర్రీ, సాంబార్, చిక్కీమంగళ చింతపండు పులిహోర, దొండకాయ చట్నీ ఎగ్ ఫ్రై, రాగిజావ
బుధ	వెజిటేబుల్ రైస్, ఆలూ కుర్మా ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ	వెజిటేబుల్ రైస్, ఆలూ కుర్మా విత్ ఎగ్ చిక్కీ
గురు	సాంబార్‌బాత్, ఉడికించిన గుడ్డు లెమన్‌రైస్ విత్ టమోటా చట్నీ, రాగిజావ	వైట్‌రైస్ అండ్ సాంబార్, ఎగ్‌ఫ్రై, రాగిజావ
శుక్ర	అన్నం, పప్పుకూర,	అన్నం, పప్పుకూర, ఎగ్ ఫ్రై, చిక్కీ ఉడికించిన గుడ్డు, చిక్కీ
శని	ఆకుకూరలతో వెజ్ రైస్, పప్పుచారు స్వీట్ పొంగల్, రాగిజావ	అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగిజావ

బాలుడి అపహరణ కేసు ఛేదన

● కావలి డీఎస్పీ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగింత



అపహరణకు గురైన బాలుడిని తల్లి తండ్రులకు అప్పగించిన డీఎస్పీ శ్రీధర్

కావలి, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): పట్టపగలు ఇంటి ఊయల లోని బాలుడిని అపహరించిన సంఘటన జిల్లాలో సంచలనం అయ్యింది. ఈ కేసును పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఒక్క రోజులోనే కేసును ఛేదించారు. బాలుడి ఆచూకీ గుర్తించి తీసుకొచ్చి తల్లిదండ్రులు రాజేశ్వరి, సురేష్‌లకు మంగళవారం రాత్రి కావలి డీఎస్పీ సమక్షంలో పోలీసులు అప్పగించారు. బాలుడిని పోలీస్ వాహనంలో తీసుకుని రాగానే వాడిని చూసి తలిదండ్రులు ఆనందంతో తీసుకుని హత్తుకున్నారు. కావలి సబ్‌డివిజన్‌లోని పోలీసులు టీమ్‌లుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినా మంగళవారం ఉదయానికి కూడా ఆ చూకీ తెలియలేదు. దీంతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ కావలికి వచ్చి దర్యాప్తును వేగవంతం చేశారు. సీసీ ఫుటేజీ, దర్యాప్తులో దొరికిన ఆధారాల మేరకు అపహరణకు పాల్పడిన మహి ళతో ఆ కుటుంబంతో ఉన్న పరిచయం, కావలిలో ఆమె ఎక్కడ పనిచేస్తుందో తెలుసుకుని వారి బంధు వులు, ఆమె పనిచేస్తున్న యజమానుల వద్ద ఆమె ఫోన్ నంబరు సేకరించారు. దీంతో ఫోన్ నంబరు ఆధారంగా ఆమె నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గ పరిధిలో ఉన్నట్లు గుర్తించి అక్కడ పోలీసు లకు కూడా సమాచారం ఇచ్చారు. దీంతో ఇక్కడ నుంచి పోలీసులు టీమ్‌లుగా వెళ్లి ఆమెను పట్టుకుని బాలుడిని తీసుకొచ్చారు. ఆమె ఎందుకు బాలుడిని అపహరించింది దీని వెనుక గల కారణాలు తదితర వివరాలను పూర్తిస్థాయి విచారణ అనంతరం తెలియజేస్తామని పోలీస్ అధికారులు తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి


రైతులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

జాతీయ రహదారి భూ సేకరణకు
జేసీ విచారణ

కందుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో 167బీ జాతీయ రహదారి నిర్మాణ అదనపు భూసేకరణకు ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణ మంగళవారం సాయంత్రం కందుకూరు పట్టణంతో పాటు ఓగూరు, పలుకూరు పరిధిలో రైతులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల నుంచి ఉన్నతాధికారుల వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకుని వెళ్లారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ, తహసీల్దార్లు ఉన్నారు.

రహదారుల్లో మలుపులు

● ఏర్పాటు చేయని హెచ్చరిక బోర్డులు ● తరుచూ ప్రమాదాలు


చుండిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

వలేటివారిపాలెం, అక్టోబరు 29: మండలంలోని చుండి, వలేటివారిపాలెం, బడేవారిపాలెం గ్రామాల్లోని రహదారుల్లో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అధికారులు ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుండి నుండి మాలకొండకు వెళ్లే మలుపు, వలే టివారిపాలెంలో బస్టాండు సెంటరు లో రెండు మలుపులు, బడేవారి పాలెం నుండి కందుకూరుకు వెళ్లే మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాల జరుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసు కోవా లని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సాలు పద్ధతిలో వరిసాగు చేస్తే అధిక దిగుబడులు


పాడిపంటల పుస్తకాలు ఇస్తున్న ఏవో రాము

కందుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సాలు ప ద్ధతితో వరిసాగు చేపడితే పెట్టుబడులను తగ్గించుకోవటంతో పాటు అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయాధికారి రాము సూచించారు. మోపాడు, మాచవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎక్కువగా కేఎన్ఎం 1638రకం వరిసాగుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. నేరుగా విత్తే పద్ధతితో నారు పెంపకం, భూమి దమ్ము చేయటం, నాట్లు వేయటం అవసరం ఉండదన్నారు. ఈ సాగులో కలుపు నివారణకు పిచికారి మందులు అందుబాటులో ఉన్నాయని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ అధికారి ధనమ్మ మాట్లాడారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేపడితే తెగుళ్ల నుంచి నివారణ పొందవచ్చన్నారు. భూమిలో వేపపిండి వేసుకుంటే నేల సారవంతమై తెగులు, పురుగు నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి ఖాసిం, వ్యవసాయ సహాయకులు రమణయ్య, రోనిరేచల్, పశువైద్య అసిస్టెంట్లు ఎస్.ప్రశాంతి, విజయ పాల్గొన్నారు.

● ఉలవపాడు (ఆంధ్రజ్యోతి): వరిసాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు, చాకిచర్లలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవంబర్‌లో మామిడి పూతలు రావడానికి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ, ఉద్యాన వన సిబ్బంది పాల్గొన్నారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): రైతులు వరి విత్తనాలు వేసే ముందు రెండు గ్రాముల కార్బెండిజమ్ మందు కలిపి నారు పోసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్రహంలింకన్ తెలిపారు. సోమవారం యర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. మండలానికి శనగ విత్తనాలు కాక్-2 రకం 250 క్వింటాళ్లు, జేజీ-11 రకం 80 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. 25శాతం సబ్సిడీపై రైతులకు అం దజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సహాయ కులు మాల్యాద్రి, వీఏఎలు రేణుక, శ్రీహరి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి

కృష్ణాపురంలో రెవెన్యూ గ్రామసభ


తహసీల్దారు లావణ్యకు వినతిని అందజేస్తున్న రైతులు

ఉలవపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేలో జరిగిన అవకతవకలను సరిజేతకు నిర్వహిస్తున్న గ్రామసభ మంగళవారం కృష్ణాపురంలో నిర్వహించారు. రైతుల నుంచి 18వినతులు తీసుకున్నట్లు తహసీల్దారు లావణ్య తెలిపారు. రీసర్వేలో మ్యుటేషన్, కొత్త ఎల్‌పీఎం కోసం, భూ సర్వే వంటి సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు.

అనుమతిలేని చోట బాణసంచా విక్రయించొద్దు

● ఎస్ఐ సాంబశివయ్య

కందుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా పట్టణంలో బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటుకు ఉన్నత పాఠశాలల ఆటస్థలంలో అనుమతులు ఇచ్చామని మరెక్కడైనా బాణసంచా విక్రయాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ సాంబశివయ్య హెచ్చరించారు. బాలుర ఉన్నత పాఠశాలలో అనుమతులు పొందిన దుకాణదారులు కూడా ఇసుక, నీళ్లు, ఇతర మంటలను ఆర్పే పరికరాలను సర్వంసిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

వాల్‌పోస్టర్ల విడుదల

● 9 నుంచి ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలు

కందుకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 9,10 తేదీల్లో ఒంగోలు మల్లయ్యలింగం భవన్‌లో జరగనున్న ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అడ్వాన్స్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పసుపులేటి పాపారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను హేతువాదసంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హేతువాదసంఘం ప్రతినిధులు గౌస్, ఎంకే బేగ్, నేచర్ తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు